RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM : HYDERABAD

సంపుటి : 10 సంచిక : 365 బుధవారం 06 - 08 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

## భారీ వర్షాల హెచ్చరిక
# సీఎం కీలక ఆదేశాలు!

- సీఎం రేవంత్ కీలక అలెర్ట్ ఇక తాజాగా రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను అలర్ట్ చేశారు
- అన్ని జిల్లాల కలెక్టర్లు, అన్ని శాఖల అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్రమత్తం చేశారు
- పజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సీఎం కీలక ఆదేశాలు
- మూడు రోజులు కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలోని అన్ని విభాగాలతో పరిస్థితిని నిరంతరం సమీక్షించాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో 8వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని, రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ కూడా ప్రకటించింది. తెలంగాణా రాష్ట్రంలో భారీ వర్షాలు... సీఎం రేవంత్ కీలక అలెర్ట్ ఇక తాజాగా రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను అలర్ట్ చేశారు.

- మిగతా 2 లో

## ఎవరి కాళ్లో పట్టుకోవాల్సిన అవసరం నాకు లేదు




కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

ఎల్బీ నగర్ నుంచి పోటీ చేసి ఉంటే మంత్రి పదవి వచ్చేదన్న కోమటిరెడ్డి

మంత్రినైతే బాగుంటుందని మునుగోడు ప్రజలు కోరుకుంటున్నారని వ్యాఖ్య

వేరే పార్టీల నుంచి వచ్చిన వారికి కూడా మంత్రి పదవులు ఇచ్చారని విమర్శ

తన నియోజకవర్గ ప్రజలు తలదించుకునే పని ఏనాడూ చేయనని చెప్పారు

# కాటన్ మాదిరి కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారు

- సర్ ఆర్థర్ కాటన్ తో కేసీఆర్ ను పోల్చిన హరీశ్ రావు
- కాటన్ మాదిరిగానే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన కేసీఆర్ కూడా తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఆయన అన్నారు
- తెలంగాణకు కాళేశ్వరం గుండెకాయ వంటిదని వ్యాఖ్య
- రాష్ట్ర భవిష్యత్తు కోసం కాళేశ్వరం, మల్లన్నసాగర్ వంటి ప్రాజెక్టులను కేసీఆర్ నిర్మించారని కితాబు



బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు రాజమండ్రి వద్ద గోదావరి నదిపై ధవళేశ్వరం బ్యారేజీని కట్టి ఉభయ గోదావరి జిల్లాల ప్రజల గుండెల్లో నిలిచిపోయిన సర్ ఆర్థర్ కాటన్ తో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను పోల్చారు. కాటన్ మాదిరిగానే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన కేసీఆర్ కూడా తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఆయన అన్నారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో

- మిగతా 2 లో

# అనిల్ అంబానీ రూ.17 వేల కోట్ల లోన్ ఫ్రాడ్

- ఈడీ విచారణకు హాజరైన రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ
- యెస్ బ్యాంక్ రుణాల కేసులో గంటల తరబడి విచారణ
- రూ.17,000 కోట్ల నిధుల మళ్లింపు, మోసంపై ప్రధాన ఆరోపణలు
- డొల్ల కంపెనీల ద్వారా నిధులు మళ్లించారా అనే కోణంలో దర్యాప్తు
- ఇటీవల ముంబై, ఢిల్లీ కార్యాలయాల్లో ఈడీ సోదాలు
- సీబీఐ కూడా రంగంలోకి దిగడంతో కేసులో ఉత్కంఠ
- రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు సంబంధించిన రూ. 14,000 కోట్లకు పైగా భారీ మోసం మరో కీలక అంశంగా ఉంది



ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ గ్రూప్ (ఆర్ఏఏజీఏ) ఛైర్మన్ అనిల్ అంబానీ మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట విచారణకు హాజరయ్యారు. రూ.17 వేల కోట్ల బ్యాంకు రుణాల మళ్లింపు, మనీలాండరింగ్ ఆరోపణలకు సంబంధించిన కేసులో అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. "తీసుకున్న రుణాలను డొల్ల కంపెనీలకు మళ్లించారా?", "నిధులు ఏవైనా రాజకీయ పార్టీలకు చేరాయా?", "అధికారులకు లంచాలు ఇచ్చారా?" వంటి కీలక ప్రశ్నలను ఈడీ అధికారులు సంధించినట్లు సమాచారం.గత దశాబ్ద కాలంగా అనిల్ అంబానీ తన గ్రూప్ కంపెనీలు తీసుకున్న రుణాలను వాటి అసలు ప్రయోజనాలకు కాకుండా

- మిగతా 2 లో

## పుతిన్‌పై కోపం, ఉక్రెయిన్‌పై ఫ్రస్టేషన్‌ను ట్రంప్ భారత్‌పై తీర్చుకుంటున్నారా?




భారత్‌పై ట్రంప్ కఠిన వైఖరి వెనుక కారణమేంటి?

రష్యా చమురు కొనుగోలు కోసం ట్రంప్ భారతదేశంపై ఇంత కఠినంగా చర్యలు తీసుకునే వారు కాదు

పుతిన్ పట్ల తనకున్న నిరాశను ఆయన భారతదేశంపై స్పష్టంగా చూపిస్తున్నారు

రష్యాకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉన్న భారత్‌పై భారత్‌పై సుంకాల దాడి చేస్తున్నారు

రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని ఇంకా ఆపలేకపోయారని స్థానిక మీడియా వర్గాలు నిలదీస్తున్నాయి

వీటన్నింటి వల్ల ట్రంప్ ఇప్పుడు భారత్‌పై చర్యలకు ఉపక్రమించినట్లు ఉన్నారు

## ఉత్తర కాశీలో జలప్రళయం... కొట్టుకుపోయిన గ్రామం

ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో కుండపోత వర్షం

ఆకస్మిక వరదలకు పూర్తిగా కొట్టుకుపోయిన ఓ గ్రామం

పలువురు స్థానికులు గల్లంతైనట్లు సమాచారం

ధారాలీ మార్కెట్ ప్రాంతంలో భారీ ఆస్తి నష్టం

సైన్యం, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు

ముందుగానే అత్యంత భారీ వర్షాల హెచ్చరిక జారీ చేసిన ఐఎండీ



దేవభూమి ఉత్తరాఖండ్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. ఉత్తరకాశీ జిల్లాలో మంగళవారం సంభవించిన కుండపోత వర్షం (క్లౌడ్ బరస్ట్) పెను విషాదాన్ని మిగిల్చింది. హర్సిల్ సమీపంలోని

- మిగతా 2 లో

# ఆర్టికల్ 370 రద్దుకు ఆరేళ్లు



దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన పవన్ కల్యాణ్

ఈ నిర్ణయంతో జాతీయ సమగ్రత బలపడిందని వెల్లడి

కశ్మీర్‌లో ఐక్యత, సమానత్వం పెరిగాయన్న పవన్

2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370ని రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం

అభివృద్ధి దిశగా జమ్మూకశ్మీర్, లడఖ్ పయనం

ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో పాలన, మౌలిక సదుపాయాలు, సామాజిక అభివృద్ధి రంగాల్లో గణనీయమైన మార్పులు

జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక స్వయం ప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370ని రద్దు చేసి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నిర్ణయం దేశ ఐక్యత, సమానత్వాన్ని బలోపేతం చేసే దిశగా వేసిన ఒక చారిత్రాత్మక ముందడుగు అని ఆయన అభిప్రాయపడ్డారు.2019 ఆగస్టు 5న కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ చట్టం రద్దుతో జమ్మూకశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించారు. ఈ ఆరో వార్షికోత్సవం సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. ఈ నిర్ణయం దేశంలోని అన్ని రాష్ట్రాల మధ్య సమానత్వాన్ని

- మిగతా 2 లో

## విజయవాడలో దేశంలోనే
# అతిపెద్ద గ్రీన్ స్కిల్లింగ్ డ్రైవ్

- ముఖ్య అతిథిగా మంత్రి నారా లోకేశ్
- పునరుత్పాదక ఇంధన నైపుణ్య కేంద్రంగా ఏపీని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ ముందడుగు
- సౌర, పవన విద్యుత్ రంగాల్లో వేలాది మంది యువతకు నైపుణ్య శిక్షణ
- కార్యక్రమానికి హాజరుకానున్న 250కి పైగా పరిశ్రమల ప్రతినిధులు
- ఏపీఎస్ఎస్‌డీసీ, స్వనీతి ఇనీషియేటివ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈవెంట్
- 2030 నాటికి 160 గిగావాట్ల సోలార్ మరియు విండ్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకొని కార్యాచరణ రూపొందించారు
- ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిలో మాత్రమే కాకుండా గ్లోబల్ టాలెంట్ ఎగుమతిదారుగా కూడా నిలవనుంది



గ్రీన్ వర్క్ ఫోర్స్ విప్లవానికి కేంద్ర బిందువుగా మారేందుకు రాష్ట్రం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు విజయవాడ నోవాటెల్ హెూటల్ లో దేశంలోనే అతిపెద్ద రెన్యువబుల్ ఎనర్జీ స్కిల్లింగ్ డ్రైవ్ ను చేపడుతోంది. దేశ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్ ను శక్తివంతం చేయడంతో పాటు సౌర, పవన శక్తికి నైపుణ్య హబ్ గా ఏపీ అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్, స్వనీతి ఇనీషియేటివ్ సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో ఈ డ్రైవ్ ను నిర్వహిస్తున్నాయి. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో 250కి పైగా పరిశ్రమల ప్రతినిధులు, ముఖ్యమైన అభివృద్ధి భాగస్వాములు హాజరుకానున్నారు. భారతదేశం 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్య లక్ష్యాన్ని సాధించేందుకు వేగంగా అడుగులు వేస్తుండగా... ఆంధ్రప్రదేశ్ ఈ గ్రీన్ వర్క్‌ఫోర్స్ విప్లవానికి కేంద్రబిందువుగా మారనుంది. భారతదేశంలోనే అతిపెద్ద గ్రీన్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ క్లీన్ ఎనర్జీ ఆర్థిక వ్యవస్థకు మానవ వనరుల కేంద్రంగా ఎదగనుంది.

- మిగతా 2 లో

# జగన్ హయాంలోనే రెడ్ బుక్ రాజ్యాంగం నడిచింది

- ప్రజా సంక్షేమాన్ని జగన్ ఏనాడూ పట్టించుకోలేదన్న మంత్రి నిమ్మల
- తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- టిడ్కో ఇళ్లపై రుణం తీసుకుని జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపణ
- ఏడాది పాలనలో వివిధ శాఖల నుంచి రూ. 430 కోట్ల పనులు తన నియోజవర్గంలో జరుగుతున్నాయని మంత్రి నిమ్మల రామానాయుడ చెప్పారు



జగన్ హయాంలోనే రెడ్ బుక్ రాజ్యాంగం నడిచిందని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పాలకొల్లులో మీడియాతో మాట్లాడుతూ... కక్షలు, అక్రమ కేసులు, దాడులు, విధ్వంస పాలన తప్పితే ప్రజా సంక్షేమాన్ని జగన్ ఏనాడూ పట్టించుకోలేదని మండిపడ్డారు.పాలకొల్లు వైసీపీ నేతలు క్రికెట్ బెట్టింగ్ లో దొరికినా, వారి అక్రమ సంపాదన

- మిగతా 2 లో

# సంపాదకీయం

## కులం అవినీతి అహంకారం

కులం, అహంకారం, అవినీతి... మన ప్రజాస్వామ్య వ్యవస్థలను, సమాజాన్ని పట్టి పీడిస్తున్న జాడ్యాలు. కులం రెండువైపులా పదును ఉన్న కత్తిగా మారింది. అధికారంతో కూడిన అహంకారం వ్యవస్థల విధ్వంసానికి దారితీస్తున్నది. ఇక స్వార్థం డబ్బు రూపంలో జడలు విప్పుతున్నది. సమాజ ధర్మాన్నే సవాలు చేస్తున్నది. తిమ్మిని బమ్మిని చేసే సాధనంగా, అన్యాయాన్ని న్యాయంగా, అధర్మాన్ని ధర్మంగా చిత్రించే స్థాయికి అది ఎదిగింది. ధనమూల మిదం జగత్ అన్న సామెతను పరిపూర్ణంగా నిజం చేస్తున్నది. వీటన్నిటికీ మూలాధారం రాజకీయం. మంచీ చెడును వేరు చేయలేనంతగా రూపు మార్చుకుంది నేటి రాజకీయం.కులం గురించి అడగడాన్ని, మాట్లాడడాన్ని ఒకప్పుడు చిన్నతనంగా చూసేవారు. కులనిర్మూలన ఉద్యమాలు కూడ ఆంధ్రలో ఒకప్పుడు బలంగానే ఉండేవి. అందుకోసం కులాంతర వివాహాలను కూడ నాస్తికులు, హేతువాదులు, కమ్యూనిస్టులు ప్రోత్సహించేవారు. కాని క్రమంగా పరిస్థితులు మారిపోయాయి. కుల ప్రాతిపదికన ఎక్కడికక్కడ సంఘాలు ఏర్పడడం, రాజకీయ డిమాండ్లను తెరపైకి తేవడం మొదలయింది. సామాజిక న్యాయం ప్రధాన విధానంగా, నినాదంగా మారిపోయింది. వర్గం బదులు వర్ణం / కులం వెనుకబడిన తనానికి ప్రమాణం అయింది. కమ్యూనిస్టులలో కూడ క్రమంగా ఈ విషయంలో కొంత మార్పు వచ్చింది. కులానికి – అది ఏ కులమైనా – గౌరవం పెరిగిపోయింది. ఆత్మన్యూనత స్థాయి నుంచి ఆత్మగౌరవ స్థాయికి చేరుకుంది. ఒకప్పుడు పత్రికలలో కులం గురించి రాస్తే చిరాకుపడేవారు. ఒకవేళ రాయవలసి వచ్చినా 'సామాజిక వర్గం' అనే మాటను కులానికి ప్రత్యామ్నాయంగా, తప్పించుకునే ఉపాయంగా వాడేవారు. కాని సమాజంలోను, రాజకీయాలలోను వచ్చిన మార్పులతో మీడియా కూడ ఇప్పుడు నేరుగా రంగంలోకి వచ్చేసింది. కులప్రాతిపదికన వివరాలు ఇవ్వడం, విశ్లేషణలు చేయడం ఎక్కువయింది. ఎవరయినా అదేమని ప్రశ్నిస్తే 'ఏమిటయ్యా ఎంతకాలం దాచిపెడతావు?' అని ఎదురు ప్రశ్నించే పరిస్థితి. ఆ విధంగా కులం వేసుకున్న ముసుగు తొలగిపోయింది. ఇంకా చెప్పాలంటే, కులాభిమానం ముదిరి పాకానపడి కులద్వేషంగా కూడ జడలు విప్పుతున్నది.అధికారంలో ఉన్నవారికి అహంకారం కూడదంటారు. అదే పతనానికి దగ్గర దారి అని కూడా అంటారు. వ్యక్తులకే కాదు, మొత్తం సమాజానికి కూడా నష్టం జరుగుతుంది. కాని ఆచరణలో అహంకారం ఆవహించని ముఖ్యమంత్రులు తక్కువ. ఎంత ఎక్కువ అధికారం లభిస్తే, మరెంత ఎక్కువకాలం అధికారంలో కొనసాగితే అంత ఎక్కువగా అహంకారం ప్రదర్శించడం కద్దు! ఆంధ్రప్రదేశ్‌లో అధికారం చెలాయించిన 16 మంది ముఖ్యమంత్రులలో ఎక్కువ భాగం ఎంతో కొంత ఈ ధోరణి ప్రదర్శించినవారే! రెండవసారి ముఖ్యమంత్రి అయితే ఇక చెప్పనవసరం లేదు. అహంకారానికి తాము ఆమడదూరం అనుకునేవాళ్ళు, ఒకసారి ముఖ్యమంత్రి గద్దెనెక్కగానే, వారికి తెలియకుండానే అహంకారభూతం ఆవహిస్తుంది. జనానికి దూరం చేస్తుంది. ఇది అవరోహణకు నాంది.అహంకారం తర్వాత ముఖ్యమంత్రులను, తద్వారా ప్రజాజీవితాన్ని భ్రష్టుపట్టించే మరో జాడ్యం డబ్బు పిచ్చి. అవినీతి అనే మాట దీనికి పర్యాయపదం. అధికారం అందించే అవకాశాలు అనేకం తన్నుకుంటూ వస్తాయి. ఒకసారి రుచి మరిగితే ఇక అంతే సంగతులు! అవినీతి విషయంలో మన ముఖ్యమంత్రులను అందరినీ ఒకే గాటన కట్టలేం! తొలితరం ముఖ్యమంత్రులది అదొక తరహా! అవినీతి మకిలకు వీలయినంత దూరం! కాని మధ్యకాలం నాటికి మరికొంత మార్పు! చూసీచూడనట్టు నడిపించే మధ్యస్థ రకం. ఇక కొత్త మిలీనియం అయితే బిలియన్‌ల వ్యవహారంగా మారిపోయింది. ఎన్నికలలో వాడకం పెరిగేకొద్దీ, ఆర్జన కూడా అమాంతం పెరిగిపోయింది. అవసరాల హద్దులను కూడ దాటిపోయింది. కొందరికయితే ఆకాశమే హద్దు. వందల వేల కోట్ల మాటలు మూటలు – కాకపోతే కీర్తికాంక్ష ఉన్నవారు ఇందులో రవంత నయం. అభివృద్ధి %–% అవినీతి బొమ్మ బొరుసు కావడం ఈనాటి రాజకీయంలో ఒక విషాదపర్వం.స్వాతంత్ర్యానంతర రాజకీయాలలో మత సమీకరణలు ప్రధానంగా ఉండేవి. హిందూత్వ పేరుతో బీజేపీ, సెక్యులరిజం పేరుతో కాంగ్రెస్ పని చేసేవి. ప్రయోజనం పొందేవి. ఇది దేశవ్యాప్త ధోరణి. ఇటీవలి కాలంలో ఇది బీజేపీకి అనుకూలంగా మారడంతో కాంగ్రెసు పార్టీ దానికి విరుగుడుగా కులం మంత్రాన్ని తెరపైకి తెచ్చింది. కులం ప్రాంతీయ రాజకీయ చదరంగంలో ఎప్పుడూ కదను తొక్కే అశ్వం లాంటిదే. కులం బలంతో ఏర్పడిన ప్రాంతీయ పార్టీలు కూడ చాలానే ఉన్నాయి. బలహీనవర్గాలు ఓకే. కానీ అగ్రకులాల చాటింపు కూడ ఇటీవల మరీ బహిరంగం అయిపోయింది. కాంగ్రెసు విధానాలకు అనుగుణంగా రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెసు ప్రభుత్వం తెలంగాణలో కులగణన చేపట్టింది. దానినీ విపక్షాలు వివాదాస్పదం చేశాయి. అయితే కేంద్ర ప్రభుత్వం కూడ ఇటీవల కులగణనకు పచ్చజెండా ఊపింది. నిజానికి కులం విషయంలో ఉన్నంత భావోద్రేక అనుబంధం మతం విషయంలో ఉండదు. కులానికి పుట్టుకతోనే విడదీయరాని బంధం ఏర్పడుతుంది. (ఆంధ్ర రాష్ట్రంలో కులాన్ని బట్టి పార్టీ విధేయత యథాలాపంగా నిర్ణయమైపోతున్నది.) మతాన్ని మార్చుకోగలం కాని, కులాన్ని మార్చుకోలేం. కాని ఆచరణలో అలా లేదు. మతం మారిన కుటుంబాలు, తమతో పాటే కులాన్ని వెంట తీసుకువెడుతున్నాయి. ఆంధ్ర, రాయలసీమలలో కమ్మ, రెడ్డితో సహా అగ్రకులాలలో కూడ ఈ 'ద్వంద్వ పౌరసత్వం' బాగా కనబడుతుంది. వాళ్లంతా క్రిస్టియన్‌లకు క్రిస్టియన్‌లు, కులానికి తమ కులస్థులు. గుంటూరు మెట్ట ప్రాంతాలలో, ముఖ్యంగా పల్నాడులో ఈ పరిస్థితి కనిపిస్తుంది. మళ్లీ ఇస్లాంలోకి మారితే ఇది కుదరదు. ముస్లింలలో కులానికి తావు ఉండదు. అయితే ఇందులో కూడా బీసీ కులాలు / వర్గాలను గుర్తిస్తున్నారు. ఈ కులగణన లక్ష్యం మొత్తం – జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్న డిమాండ్ నుంచి పుట్టుకువచ్చిందే!

## పుతిన్‌పై కోపం, ఉక్రెయిన్‌పై ఫ్రస్టేషన్‌ను ట్రంప్ భారత్‌పై తీర్చుకుంటున్నారా?



**మొదటిపేజీ తరువాయి –**

భారత్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న కఠిన వైఖరిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఇటీవల భారత్‌పై 25 శాతం అదనపు దిగుమతి సుంకాలను ప్రకటించిన ట్రంప్, రష్యా నుంచి ఆయుధాలు, ముడి చమురును కొంటున్నందుకు పెనాల్టీని విధిస్తామని హెచ్చరించారు. ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న మొదటి టర్మ్?లో, రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా భారత్ పట్ల సౌమ్యంగా వ్యవహరించిన ట్రంప్?కు భారత్?పై ఉన్నట్టుండి కోపమెందుకు వచ్చింది? రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలో తను అనుకున్నది జరగలేదన్న నిర్వేదంలో ట్రంప్ ఉన్నారా? పుతిన్‌పై వచ్చిన కోపం, ఉక్రెయిన్?పై ఫ్రస్టేషన్?ను ట్రంప్ భారత్?పై తీర్చుకుంటున్నారా? వంటి ప్రశ్నలపై ఈటీవీ భారత్? ప్రత్యేక కథనం.

**ట్రంప్‌పై భారత్‌కు ఎందుకు కోపం?**

అయితే నిన్నమొన్నటి వరకు భారత్‌తో చక్కగా వ్యవహరించిన ట్రంప్, ఇప్పుడు అక్కసు వెళ్లగక్కడం వెనుక వివిధ కారణాలు వినిపిస్తున్నాయి. నిజానికి రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వారం రోజుల్లో రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేస్తానని గొప్పలు చెప్పుకున్నారు. అది వారం కాస్త నెలలుగా మారింది. ఇప్పటి వరకు యుద్ధం ఆగేలా ట్రంప్ చేయలేకపోయారు. కొన్ని రోజుల క్రితం యుద్ధం ఆపడానికి ఆగస్టు 8వ తేదీని డెడ్‌లైన్‌ను విధించారు.

**పుతిన్ పట్టించుకోకపోవడంతోనే!**

కానీ దానికి ఇంకా మూడు రోజుల సమయమే ఉన్నా, ఇప్పటికీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బేఖాతరు చేస్తున్నారు. కనీసం ఒక్కసారి కూడా ఆయన ట్రంప్ డెడ్?లైన్?పై స్వయంగా స్పందించలేదు. చెప్పాలంటే, ట్రంప్ వ్యాఖ్యలను ఆయన పూర్తిగా పట్టించుకోవడం లేదు. దీంతో రష్యాపై ట్రంప్ చాలా కోపంతో ఉన్నారు. తన మాటలను పట్టించుకోవడం లేదని ఆగ్రహంతో ఉన్నట్లు కనిపిస్తున్నారు. అదే సమయంలో ఉక్రెయిన్?పై ఫ్రస్టేషన్‌తో కూడా ఉన్నారు.

**అనుకున్నది జరగలేదన్న నిర్వేదంలో!** నిజానికి ఉక్రెయిన్‌కు అమెరికా ఎప్పటి నుంచో మద్దతు ఇస్తుంది. 2022 ఫిబ్రవరి నుంచి ఇప్పటిదాకా ఉక్రెయిన్‌కు అమెరికా దాదాపు రూ.15 లక్షల కోట్లకుపైగా సైనిక సహాయాన్ని అందించింది. ఆ దేశంలో రక్తపాతాన్ని సృష్టిస్తున్న రష్యాపై తీవ్రంగా మండిపడుతోంది. అందులో భాగంగానే ఇప్పుడు యుద్ధాన్ని ఆపేలా ట్రంప్ పథకాలు రచిస్తున్నారు. కానీ అవి సక్సెస్ అవ్వడం లేదు. పుతిన్ దగ్గర ట్రంప్ పప్పులు ఉడకడం లేదు. నయానో భయానో మాస్కోను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. కానీ అది కుదరక ఉక్రెయిన్‌పై ఫ్రస్టేషన్‌తో ఉన్నారు. యుద్ధం విషయంలో తను అనుకున్నది జరగలేదన్న నిర్వేదంలో ఉన్నారు.నిరాశ, నిస్పృహలతో మునిగితేలుతున్నారు. తాను ప్రపంచానికి శాంతి దూత కావాలనుకున్న కల నెలవేరలేదని కలత చెందుతున్నట్లు ఉన్నారు. అదే సమయంలో ఆయనకు సొంత దేశంలోనూ విమర్శలు వస్తున్నాయి. రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని ఇంకా ఆపలేకపోయారని స్థానిక మీడియా వర్గాలు నిలదీస్తున్నాయి. దీంతో వీటన్నింటి వల్ల ట్రంప్ ఇప్పుడు భారత్‌పై చర్యలకు ఉపక్రమించినట్లు ఉన్నారు. రష్యాకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉన్న భారత్‌పై భారత్‌పై సుంకాల దాడి చేస్తున్నారు. పలువురు నిపుణులు కూడా అదే చెబుతున్నారు."ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపేయాలన్న ట్రంప్ పిలుపును పుతిన్ పట్టించుకోలేదు. రష్యా చమురు కొనుగోలు కోసం ట్రంప్ భారతదేశంపై ఇంత కఠినంగా చర్యలు తీసుకునే వారు కాదు. పుతిన్ పట్ల తనకున్న నిరాశను ఆయన భారతదేశంపై స్పష్టంగా చూపిస్తున్నారు" "ఎక్కువ ఖరీదైన అమెరికన్ చమురును భారత్ కొనుగోలు చేయాలని ట్రంప్ కోరుకుంటున్నారు. 2021లో ఉక్రెయిన్‌పై రష్యా దాడికి ముందు, అమెరికా దగ్గర చమురు కొనుగోలు చేసిన దేశాల్లో భారత్? అగ్రస్థానంలో ఉంది. కానీ ఆ తర్వాత రష్య నుంచి చమురు దిగుమతులను పెంచింది. అది కూడా ట్రంప్? కోపంలో ఒక కారణం కావచ్చు. ట్రేడ్? డీల్ ఖరారు కాకపోవడం కూడా మరో కారణం కావొచ్చు" అని తెలిపారు. ఏదేమైనా పుతిన్‌పై కోపం, ఉక్రెయిన్‌పై ఫ్రస్టేషన్‌ను ట్రంప్ భారత్‌పై తీర్చుకుంటున్నారని అంటున్నారు. భారత్‌నే ట్రంప్ లక్ష్యంగా చేసుకోవడాన్ని ఖండిస్తున్నారు.

## ఎవరి కాళ్లో పట్టుకోవాల్సిన అవసరం నాకు లేదు

మంత్రి పదవిపై తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎల్బీ నగర్ నుంచి పోటీ చేసి ఉంటే తనకు మంత్రి పదవి వచ్చేదని... కానీ, నియోజ కవర్గ ప్రజల కోసం మునుగోడు నుంచి పోటీ చేశానని చెప్పారు. తనకు మంత్రి పదవి వస్తే అది ప్రజలకే ఉపయోగపడుతుందని అన్నారు. మంత్రి పదవి కావాలా? మునుగోడు ప్రజలు కావాలా? అని అడిగితే... తనకు మునుగోడు ప్రజలే కావాలని చెబుతానని తెలిపారు.తాను మంత్రినైతే మంచి జరుగుతుందని మునుగోడు ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి, తన జూనియర్లకు కూడా మంత్రి పదవులు ఇచ్చారని... ఎవరి కాళ్లో మొక్కి మంత్రి పదవి తెచ్చుకోవాల్సిన అవసరం తనకు లేదని అన్నారు. తన నియోజకవర్గ ప్రజలు తలదించుకునే పని ఏనాడూ చేయనని చెప్పారు.



## భారీ వర్షాల హెచ్చరిక..సీఎం కీలక ఆదేశాలు!



**మొదటిపేజీ తరువాయి –** అన్ని జిల్లాల కలెక్టర్లు, అన్ని శాఖల అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్రమత్తం చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కీలక ఆదేశాలు ఇచ్చారు. వచ్చే మూడు రోజులు వర్షాలే.. సీఎం ఏం చెప్పారంటే సెక్రటేరియట్లో ఉన్నతాధికారులతో మాట్లాడిన సీఎం లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షితంగా ఉండేలా సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. జిహెచ్ఎంసి తోపాటు రాష్ట్రవ్యాప్తంగా వరద నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. ఇక రానున్న మూడు రోజులు కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలోని అన్ని విభాగాలతో పరిస్థితిని నిరంతరం సమీక్షించాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు. ఎలాంటి పరిస్థితి అయినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి ఎక్కడ ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని, అందరూ జిల్లాలలోనే అందుబాటులో ఉండాలని సూచించారు. విపత్తు సహాయక బృందాలు అందుబాటులో ఉండి తక్షణమే స్పందించాలని ఆయన అన్నారు. ఇక సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు తమకు నివేదికలు అందించాలని ఉన్నతాధికారులు కలెక్టర్లను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. %ూశ్రీంశీ =ముం% నాలుగురోజులు వర్షాలే... హెచ్చరిస్తున్న బంగాళాఖాతం.. ఐఎండీ అలెర్ట్! నేడు 13 జిల్లాలు, రేపు 12 జిల్లాలలో భారీ వర్షం ఇదిలా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాలతో పాటు హైదరాబాద్లోని అనేక ప్రాంతాలలో నిన్న భారీ వర్షం కురిసింది. ప్రస్తుతం కూడా రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని జిల్లాలలో భారీ వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. నేడు రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాలలో వర్షం కురుస్తుందని పేర్కొంది. రేపు 12 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్న క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి అని పేర్కొంది.

## విజయవాడలో దేశంలోనే అతిపెద్ద గ్రీన్ స్కిల్లింగ్ డ్రైవ్

**మొదటిపేజీ తరువాయి – వేలాది మంది యువతకు సోలార్, విండ్ ఎనర్జీ రంగాల్లో నైపుణ్య శిక్షణ**

పునరుత్పాదక ఇంధన నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది యువతకు సోలార్, విండ్ ఎనర్జీ రంగాల్లో తయారీ నుంచి ఇన్‌స్టలేషన్, ఆపరేషన్స్, నిర్వహణ వరకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. ఇది కేవలం నైపుణ్య శిక్షణ కార్యక్రమం మాత్రమే మాత్రమే కాకుండా క్లీన్ ఎనర్జీ, వాతావరణ మార్పులకు తగ్గ నైపుణ్యాల అభివృద్ధికి, పరిశ్రమల వృద్ధికి దోహదపడే విధంగా రూపొందించారు. 2030 నాటికి 160 గిగావాట్ల సోలార్ మరియు విండ్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకొని కార్యాచరణ రూపొందించారు.ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిలో మాత్రమే కాకుండా గ్లోబల్ టాలెంట్ ఎగుమతిదారుగా కూడా నిలవనుంది. ఈ సమావేశంలో మూడు హై-ఇంపాక్ట్ ప్యానెల్ డిస్కషన్స్ నిర్వహించనున్నారు. సోలార్, విండ్ పరిశ్రమల దిగ్గజాలు... పాలసీ మేకర్లు, శిక్షణ సంస్థలతో కలిసి డిమాండ్ ఆధారిత, పరిశ్రమల అవసరాలకు తగ్గ వర్క్ ఫోర్స్ అభివృద్ధికి రోడ్‌మ్యాప్ రూపొందించనున్నారు. అదనంగా ప్రైవేట్ సెక్టార్ గ్రీన్ స్కిల్లింగ్ టాస్క్‌ఫోర్స్‌ను కూడా ప్రారంభించనున్నారు.

## జగన్ హయాంలోనే రెడ్ బుక్ రాజ్యాంగం నడిచింది

**మొదటిపేజీ తరువాయి –** వెలుగు చూసినా దినపత్రికలో ఎందుకు ప్రచురించలేదని రామానాయుడు ప్రశ్నించారు. తాను బాధ్యతతో పని చేస్తుంటే... సాక్షి దినపత్రికలో కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో వివిధ శాఖల నుంచి రూ. 430 కోట్ల పనులు తన నియోజవర్గంలో జరుగుతున్నాయని చెప్పారు.టిడ్కో గృహాల ప్రారంభోత్సవ సభలో స్టేజిపై నుంచి తమను గెంటివేసినప్పుడు సాక్షి పత్రిక ఏమైందని మండిపడ్డారు. తమపై దాడులు చేసి తమపైనే ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టిన చరిత్ర వైసీపీదని అన్నారు. తాము నిర్మించిన ఒక్కో టిడ్కో ఇంటిపై రూ. 3.65 లక్షల రుణం తీసుకుని గత జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు.

## కాటన్ మాదిరి కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారు



మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.బ్రిటీష్ పాలనా కాలంలో ధవళేశ్వరం బ్యారేజీని ఆర్థర్ కాటన్ నిర్మించారని... రైతులకు మేలు జరగాలనే ఆకాంక్షతో ఉభయ గోదావరి జిల్లాలనకు సాగునీరు అందించారని హరీశ్ కొనియాడారు. ఆ రోజుల్లోనే కాటన్ మీద బ్రిటీష్ ప్రభుత్వం హెమింగ్టన్ కమిషన్ వేసిందని... ఆ కమిషన్ కాటన్ ను 900 ప్రశ్నలు అడిగి ఎంతో కాలం వేధించిందని తెలిపారు. అయినా, చివరకు ఏం జరిగింది? ఇప్పటికీ గోదావరి జిల్లాల ప్రజల గుండెల్లో కాటన్ నిలిచిపోయారని అన్నారు. అదే విధంగా చరిత్ర పుటల్లో తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ నిలిచిపోతారని చెప్పారు.తెలంగాణకు కాళేశ్వరం గుండెకాయ వంటిదని హరీశ్ అన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి రేవంత్ కు కూడా తెలుసని వ్యాఖ్యానించారు. మల్లన్నసాగర్ నుంచి మూసీలోకి నీళ్లు పోయడానికి రూ. 6 వేల కోట్లకు టెండర్లను ఫైనల్ చేశారని... మల్లన్నసాగర్ కాళేశ్వరంలో భాగమేనని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్ కోసం కాళేశ్వరం, మల్లన్నసాగర్ లాంటి ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించారని చెప్పారు.

## ఆర్టికల్ 370 రద్దుకు ఆరేళ్లు

**మొదటిపేజీ తరువాయి –** పెంపొందించిందని, జాతీయ సమగ్రతను మరింత బలపరిచిందని పేర్కొన్నారు.ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో పాలన, మౌలిక సదుపాయాలు, సామాజిక అభివృద్ధి రంగాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని ఆయన నొక్కి చెప్పారు. అధికారిక గణాంకాల ప్రకారం, 2019 నుంచి ఇప్పటివరకు ఆ ప్రాంతంలో సుమారు 5,600 కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు వచ్చాయని, మరో 66,000 కోట్ల రూపాయల విలువైన ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. ఈ పరిణామాలు కశ్మీర్ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నాయని అన్నారు.కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఈ బిల్లుకు రాజ్యసభలో 125-61, లోక్‌సభలో 370-70 ఓట్ల తేడాతో భారీ మెజారిటీతో ఆమోదం లభించింది. ఈ నిర్ణయం దేశ సమైక్యతను, రాజ్యాంగ సమగ్రతను కాపాడటానికి తీసుకున్న సాహసోపేతమైన చర్యగా పవన్ కల్యాణ్ వంటి నేతలు అభివర్ణిస్తున్నారు.

## రూ.17 వేల కోట్ల లోన్ ఫ్రాడ్ కేసు అనిల్ అంబానీపై ఈడీ ప్రశ్నల వర్షం



**మొదటిపేజీ తరువాయి –** ఉద్దేశపూర్వకంగా పక్కదారి పట్టించారనే ఆరోపణలపై ఈడీ దృష్టి సారించింది. ఈ కేసులో రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిలయన్స్ కమ్యూనికేషన్స్ వంటి పలు కంపెనీలు ఉన్నాయి. ముఖ్యంగా 2017 నుంచి 2019 మధ్య యెస్ బ్యాంక్ నుంచి తీసుకున్న సుమారు రూ. 3,000 కోట్ల రుణాల మళ్లింపు ఒక అంశం కాగా, రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు సంబంధించిన రూ. 14,000 కోట్లకు పైగా భారీ మోసం మరో కీలక అంశంగా ఉంది.ఈ కేసు దర్యాప్తులో భాగంగా గత వారం ఈడీ అధికారులు ముంబై, ఢిల్లీలోని అనిల్ అంబానీకి సంబంధించిన పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో పెద్ద ఎత్తున పత్రాలు, హార్డ్ డ్రైవ్‌లు, ఇతర డిజిటల్ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. యెస్ బ్యాంక్ రుణ మోసం కేసులో మనీలాండరింగ్ కోణంలో మొదలైన ఈ దర్యాప్తు, ఇప్పుడు మరింత విస్తృతంగా మారింది.బ్యాంకు నిధులను డొల్ల కంపెనీల ద్వారా మళ్లించి, రిలయన్స్ గ్రూప్ సంస్థలు దుర్వినియోగం చేశాయా అనే దానిపై ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది. ఇదే సమయంలో, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) కూడా అనిల్ అంబానీ గ్రూపులోని ఇతర కంపెనీలపై తనదైన శైలిలో విచారణ ప్రారంభించినట్లు తెలుస్తోంది. కాగా, అనిల్ అంబానీ విచారణను అధికారులు కెమెరాల్లో రికార్డ్ చేస్తున్నారని, విచారణ సమయంలో న్యాయవాదిని అనుమతించలేదని నివేదికలు చెబుతున్నాయి.

## ఉత్తర కాశీలో జలప్రళయం కొట్టుకుపోయిన గ్రామం



ధారాలీ ప్రాంతంలో ఆకస్మిక వరద పోటెత్తడంతో ఒక గ్రామం పూర్తిగా కొట్టుకుపోయినట్లు అధికారులు తెలిపారు. ఈ దుర్ఘటనలో పలువురు స్థానికులు గల్లంతైనట్లు సమాచారం అందడంతో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.ధారాలీ వద్ద ఉన్న ఖీర్ గధ్ వాగులో నీటిమట్టం ఒక్కసారిగా ప్రమాదకర స్థాయిలో పెరగడంతో వరద నీరు సమీపంలోని మార్కెట్ ప్రాంతాన్ని ముంచెత్తింది. దీనివల్ల తీవ్ర ఆస్తి నష్టం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీస్, అగ్నిమాపక శాఖ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్), భారత సైన్యం రంగంలోకి దిగాయి. విపత్తు సహాయక బృందాలు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు ప్రారంభించాయి.ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ధారాలీ ప్రాంతంలో కుండపోత వర్షం వల్ల జరిగిన నష్టం గురించి తెలిసి చాలా బాధపడ్డాను. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, జిల్లా యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నాయి" అని ఆయన 'ఎక్స్' వేదికగా తెలిపారు. సీనియర్ అధికారులతో తాను నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నానని చెప్పారు. "అందరూ క్షేమంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు.అధికారులు నదీ తీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. నదులు, వాగుల వద్దకు వెళ్లవద్దని, పిల్లలు, పశువుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల సంఖ్యపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.కాగా, ఆగస్టు 4 నుంచి ఉత్తరకాశీ, పౌరీ గఢ్వాల్, టెహ్రీ, చమోలీ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఒకరోజు ముందే హెచ్చరికలు జారీ చేసింది. ఈ హెచ్చరికల నేపథ్యంలో డెహ్రాడూన్ జిల్లా యంత్రాంగం పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించింది. ముఖ్యమంత్రి ధామి కూడా అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ సమావేశం నిర్వహించి సంసిద్ధతను సమీక్షించారు. అయినప్పటికీ ఈ స్థాయిలో నష్టం జరగడం విచారకరం.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY

బుధవారం 06 - 08 - 2025

## బద్ది పోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు......





**వేములవాడ,ఆగష్టు 05 (తెలంగాణ సేన) :** దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన వేములవాడ రాజన్న ఆలయానికి అనుబంధ దేవాలయమైన శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయానికి మంగళ వారం రోజున భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో భక్తులు కుటుంబ సమేతంగా బోనాల మొక్కులు చెల్లించుకునేందుకు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిట లాడాయి.అమ్మవారికి ప్రీతిపాత్రమైన పసుపు కుంకుమలను, బోనాల నైవే ద్యాలను సమర్పించుకొని సేవలో తరించారు.తమ ఇంటిల్లిపాదినీ పిల్లాపాపలను చల్లగా చూడు తల్లి అంటూ అమ్మవారిని భక్తులు వేడుకున్నారు.

## మహిళ పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన వ్యక్తి రిమాండ్

- వేములవాడ రూరల్ ఎస్ఐ అంజయ్య



**వేములవాడ,ఆగష్టు 05 (తెలంగాణ సేన) :** వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామానికి చెందిన హుస్సేన్ అనే వ్యక్తి ఒక మహిళ పట్ల అసభ్యకరంగా వ్యవహరించటం, వీడియో తీయుటకు ప్రయత్నం చేయటం వంటి చర్యల కారణంగా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించటం జరిగిందని వేములవాడ రూరల్ ఎస్ ఐ అంజయ్య తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ ఐ అంజయ్య మాట్లాడుతూ మహిళల పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన, మహిళలను శారీరకంగా మానసికంగా హింసించిన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని మహిళలు వారిపై జరుగుతున్న చర్యలు మౌనంగా భరించద్దని ధైర్యంగా ముందుకు వచ్చి సంబంధిత పోలీస్ స్టేషన్ లో కానీ జిల్లా షీ టీమ్ కి గాని సంప్రదించాలని ఆయన సూచించారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో 58 మందికి జరిమానా

- మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష, జరిమానా తప్పదు,తస్మాత్ జాగ్రత్త..

- పట్టణ న్స్పెక్టర్ కృష్ణ





**రాజన్న సిరిసిల్ల,ఆగష్టు 05 (తెలంగాణ సేన) :** సిరిసిల్ల పట్టణంలో గత 14 రోజులుగా నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 58 మంది మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానా విధించారు.మంగళవారం రోజున సిరిసిల్ల పోలీసులు ఈ 58 మందిని కోర్టులో ప్రవేశపెట్టగా,సిరిసిల్ల మెజిస్ట్రేట్ జయశ్రీ వారికి జరిమానాలు విధిస్తూ తీర్పు వెల్లడించారు.ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపీఎస్ ఆదేశాల మేరకు పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వారికి ట్రాఫిక్ ఎస్సై దిలీప్ వారి తల్లిదండ్రులు, కుటుంబ పెద్దల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి,భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు చేయమని ప్రతిజ్ఞ చేయించారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు సంబంధించిన పోలీస్ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయని,ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ కృష్ణ స్పష్టం చేశారు.

## అగ్రహారం అంజన్న ఆలయ అభివృద్ధి పనులు మొదలు పెట్టాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**వేములవాడ, ఆగష్టు 05 (తెలంగాణ సేన) :** అంజన్న ఆలయంలో అభివృద్ధి పనులు మొదలు పెట్టాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేముల వాడ మండలం అగ్రహారంలోని హనుమాన్ ఆలయం వద్ద రూ.31 లక్షలతో ఆర్చి,ప్రాకారం సాలహారంతో కలిసి, కమాన్ నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మంగళవారం ఆలయం వద్ద పరిశీలించి ఆలయ ఈవో శ్రీనివాస్ కు, అధికారులకు పలు సూచనలు చేశారు.సిరిసిల్ల - కరీంనగర్ ప్రధాన రహదారి మధ్య నుంచి 50 ఫీట్ల దూరం నుంచి ఆర్చి,ప్రాకారం సాలహారంతో కలిసి, కమాన్ నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు.టెండర్ ప్రక్రియ ఇటీవల పూర్తి అయిందని వెల్లడించారు.

## నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం

- ఎమ్మార్వో సుజాత



**రాజన్న సిరిసిల్ల,ఆగష్టు 05 (తెలంగాణ సేన) :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సాధు వెంకట్ రెడ్డి ఫంక్షన్ హాల్లో ఆగస్ట్ 6 బుధవారం రోజున నూతన రేషన్ కార్డు లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు.బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవు తుందని, అర్హత పొందిన లబ్ధిదారులు తప్పక హాజరై కార్డులు పొందాలని ఆమె కోరారు.ప్రభుత్వ మద్దతుతో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మరింత మంది లబ్ధిదారులకు రేషన్ సౌకర్యం అందుబాటులోకి రానుందని అధికార వర్గాలు తెలిపాయి.

## అంగడిపేట్ హనుమాన్ దేవాలయం వద్ద అన్నదానం



**(తెలంగాణ సేన,** సిద్దిపేట జిల్లా గజ్వేల్ అంగడిపేట హనుమాన్ దేవాలయం వద్ద మంగళవారం ధనలక్ష్మి క్యాటరింగ్ యజమాని లక్ష్మీ కుటుంబ సభ్యుల సౌజన్యంతో పులిహోర పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్ మాజీ ఉప సర్పంచ్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ అన్నదానం మహాదానమని ప్రతి మంగళవారం పులిహోర పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ధనలక్ష్మి క్యాటరింగ్ వారి సౌజన్యంతో పులిహోర పంపిణీ చేయడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడు సిద్ధి బిక్షపతి, ఇటిక్యాల తాజా మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల భద్రయ్య, కొండ పోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ అయిత సత్యనారాయణ, కైలాస ప్రశాంత్, సిద్ధి రామచంద్రం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు..

# ఇందిరమ్మ కాలనీలో కాంగ్రెస్ నేతల సమావేశం...

- వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యం

- తంగళ్ళపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జలగం ప్రవీణ్





**రాజన్న సిరిసిల్ల,ఆగష్టు 05 (తెలంగాణ సేన) :** టీపీసీసీ పిలుపు మేరకు ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా తంగళ్ళపల్లి మండలంలోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జలగం ప్రవీణ్ ఆదేశాల మేరకు, ఇందిరమ్మ కాలనీకి ఇంచార్జ్‌లుగా నియమించబడిన మచ్చ శ్రీనివాస్, ఎగుర్ల ప్రశాంత్,కట్కం రాజశేఖర్, గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్ నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.గత 18 నెలలుగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి గ్రామంలోని మహిళలకు అవగాహన కల్పించారు.ముఖ్యంగా సంక్షేమ కార్యక్రమాలు,మహిళా అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై విస్తృతంగా వివరించారు.అలాగే గ్రామంలో రాబోయే స్థానిక ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు మెంబర్ల అభ్యర్థుల వివరాలను కూడా గ్రామస్థుల నుండి సేకరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు,గడ్డం మధుకర్,కొంపెల్లి శ్యామ్,గోరింటాల రాజమల్లు,అంబటి ఆంజనేయులు,బల్ల లక్ష్మీపతి, బోగా రంగయ్య,దిడ్డి శ్రీనివాస్, సంపతి మల్లేశం,బండారి కిషన్, మామిడాల రమేష్,కొండా కనుకయ్య,ఆడెపు సత్యనారాయణ,వేముల కుమారస్వామి,చిలుక శ్రీనివాస్, బైరి వేణు,కొండా రాజు,తదితరులు పాల్గొన్నారు.మహిళలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జిల్లాలో బీడీ కార్మికుల సంక్షేమం కోసం ఉద్యమించాలి

- ఏఐటీయూసీ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ సమావేశంలో తీర్మానం




**వేములవాడ,ఆగష్టు 05 (తెలంగాణ సేన) :** జిల్లాలోని సుభాష్ నగర్‌లో ఏఐటీయూసీ కార్మిక భవన్‌లో తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సమావేశం అధ్యక్షురాలు కె.వి.అనసూర్య ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో బీడీ రంగానికి చెందిన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.దేశంలో,రాష్ట్రంలో లక్షలాది మంది బీడీ రంగంలో ప్రత్యక్షంగా,పరోక్షంగా పని చేస్తున్నప్పటికీ బీడీ పరిశ్రమపై ప్రభుత్వాలు అనేక ఆంక్షలు విధిస్తున్నాయని విమర్శించారు. విదేశీ సిగరెట్ల అమ్మకాలను మాత్రం అడ్డుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని,ఇది కార్మిక వర్గానికి అన్యాయం చేస్తున్నదని పేర్కొన్నారు.బీడీ టెకేదార్లు కంపెనీలు ఇచ్చే కమిషన్ కాకుండా కార్మికులపై నెలకు 2 వేల నుండి 3 వేల బీడీల కోత పెడుతున్నారని, తక్కువ వేతనాలతో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.జిల్లాలో బీడీ కార్మికుల కోసం ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మించాలని, వీడిఏ ప్రకారం వెయ్యి బీడీలకు రూ.261.97 వేతనంగా చెల్లించాలని, ఈపిఎఫ్ వో పింఛన్ నెలకు రూ.6000 చేయాలని, కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్లుగా బీడీ కార్మికులకు రూ.4016 ఆసరా పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు.అర్హులైన కార్మికులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, టెకేదార్లు సరైన ముడిసరకులు ఇవ్వకపోవడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.కొన్ని కంపెనీలు బీడీ తయారీకి బదులుగా కుర్కురేలు వంటి ఇతర వస్తువులను తయారు చేయిస్తున్నాయని,ఇది మానివేయాలని కోరారు.ప్రతి బీడీ కార్మికుడికి పీఎఫ్ నంబర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని,ఈపిఎఫ్ వో బెనిఫిట్స్ పొందే విషయంలో వారసులను అనవసరమైన డాక్యుమెంట్స్‌తో వేధించకుండా ఆధార్‌తో సంబంధం లేకుండా ఇతర ప్రూఫ్‌ల ఆధారంగా ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు.విదేశీ సిగరెట్ల అమ్మకాలను దేశవ్యాప్తంగా నిషేధించాలని,నెలలో ఒకసారి లేబర్ ఆఫీసర్ ఆధ్వర్యంలో అన్ని రంగాల కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు.ఈ సమావేశంలో నల్ల చంద్రమౌళి,అధ్యక్షులు కడారి రాములు,జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్జ వేణు, ఉపాధ్యక్షులు రేగుల అనిత, గుమ్మడవెల్లి మంజుల, కోశాధికారి సుంకనపెల్లి శాంతమ్మ, కౌన్సిల్ సభ్యులు ఎంజాల లక్ష్మీ, గాజుల రాధ,తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిని తుంచేదెలా?

ఏసీబీ నిఘా ఉన్నా లంచాల అడ్డుకట్ట ఎందుకు పడడం లేదు?

**నిర్మల్: ఆగష్టు 05 :తెలంగాణ సేన న్యూస్ :** తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కార్యకలాపాలు ఊపందుకుం టున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు 168 కేసులు నమోదు చేసి, దాదాపు 145 మందిని అరెస్టు చేయడం, రూ. 39 కోట్లకు పైగా అక్రమాస్తులు స్వాధీనం చేసుకోవడం ద్వారా ఏసీబీ తన ఉనికిని చాటుకుంటోంది. అయితే, ఈ గణాంకాలు ఒకవైపు ప్రజల్లో ఆశను రేకెత్తిస్తున్నా, మరోవైపు అవినీతి వాస్తవ పరిస్థితులు భిన్నంగా కనిపిస్తున్నాయి. “లంచం లేనిదే ప్రభుత్వ కార్యాలయాల్లో పని జరగదు” అన్న భావన ఇంకా బలంగా కొనసాగుతోంది. ఏసీబీ దాడులు, అరెస్టులు పెరుగుతున్నప్పటికీ, అవినీతి ఆగడాలు తగ్గకపోవడానికి గల లోతైన కారణాలను విశ్లేషిస్తే, వ్యవస్థలో పాతుకుపోయిన కొన్ని లోపాలు, సంక్లిష్టమైన సమస్యలు బయటపడుతున్నాయి. ఈ సమస్యకు మూలాలను వెతికితే, అది కేవలం అధికారుల వ్యక్తిగత తప్పు మాత్రమే కాదని, వ్యవస్థలో ఉన్న పెద్ద లోపమని తెలుస్తోంది. ఏసీబీ దాడులు కేవలం ఒక తాత్కాలిక పరిష్కారంగా మాత్రమే మిగిలిపోతున్నాయా అన్న సందేహం వ్యక్తమవుతోంది. అవినీతి తగ్గకపోవడానికి ప్రధాన కారణాలలో మొదటిది న్యాయ ప్రక్రియలో తీవ్రమైన జాప్యం మరియు న్యాయపరమైన లొసుగులు. ఏసీబీ కేసు నమోదు చేసిన తర్వాత, దానిపై విచారణ, కోర్టులో తీర్పు రావడానికి చాలా సంవత్సరాలు పడుతుంది. ఈ సుదీర్ఘ కాలంలో నిందితుడు బెయిల్‌పై బయటకు వచ్చి యథావిధిగా తన జీవితాన్ని కొనసాగించవచ్చు. ప్రభుత్వంలో కొనసాగుతున్న పదవిలో ఉండకపోయినా, అతనిపై విచారణ ఇంకా కొనసాగుతుంది. ఈ వ్యవధిలో చాలా మంది నిందితులు న్యాయపరమైన లొసుగులను ఉపయోగించుకొని శిక్షల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తారు. సరైన సాక్ష్యాలు లేకపోవడం, కేసును సమర్థవంతంగా నిరూపించలేకపోవడం వంటి కారణాల వల్ల చివరికి చాలా మంది అధికారులు నిర్దోషులుగా బయటపడు తున్నారు. ఇది ఇతర అధికారులలో భయాన్ని తగ్గించి, అవినీతికి పాల్పడే ధైర్యాన్ని మరింత పెంచుతోంది. రెండవ ప్రధాన కారణం అవినీతిపరులను ఉద్యోగం నుంచి తొలగించే ప్రక్రియలో కఠినత్వం లేకపోవడం. ఒక ఉద్యోగి అవినీతికి పాల్పడినట్లు ఏసీబీకి పట్టుబడితే, అతనిపై కేవలం సస్పెన్షన్ మాత్రమే విధించబడుతుంది. సస్పెండ్ అయిన ఉద్యోగి జీతంలో కొంత భాగాన్ని పొందుతూనే ఉంటాడు. అంతేకాకుండా, కోర్టులో విచారణ కొన్నేళ్ల పాటు కొనసాగి, ఆ తర్వాత నిందితుడు నిర్దోషిగా విడుదల అయితే, అతనిని తిరిగి విధుల్లోకి తీసుకోవాల్సి వస్తుంది. ఈ ప్రక్రియ అవినీతిపరులకు ఒక రక్షణ కవచంలా పనిచేస్తోంది. అవినీతి రుజువైన వెంటనే, కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా, ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించే కఠినమైన విధానం లేకపోతే లంచాల ఆగడాలు ఆగవు. అవినీతికి పాల్పడిన ఉద్యోగులకు ఆర్థికంగా, సామాజికంగా భారీ నష్టం వాటిల్లకపోతే ఈ పరిస్థితి మారదు. ఇక మూడవ కారణం వ్యవస్థీకృత అవినీతి (%వాఎర్వఎఅష జశీతీతీబజూఅశీఅ%). అవినీతి అనేది కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన సమస్య కాదు, అది ఒక వ్యవస్థీకృత లోపంగా, ఒక సంప్రదాయంగా మారిపోయింది. ఒక పని జరగాలంటే, అది కింది స్థాయి గుమాస్తా నుంచి ఉన్నత అధికారి వరకు చేతులు మారుతుంది. “అవినీతి లేనిదే ఫైలు కదలదు” అనే వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఒక అధికారిని అరెస్టు చేస్తే, అతని స్థానంలో వచ్చిన కొత్త అధికారి కూడా అదే పద్ధతిని కొనసాగిస్తున్నాడు. ఈ వ్యవస్థను సమూలంగా మార్చకుండా, కేవలం వ్యక్తులను పట్టుకుంటే ప్రయోజనం ఉండదు. ఒక శాఖలోని ముఖ్యమైన వ్యక్తులందరూ అవినీతిలో భాగమైతే, ఒకరి అరెస్టుతో ఆ వ్యవస్థ మొత్తం శుభ్రం కాదు. ఏసీబీ పనితీరుపై అనుమానాలు కూడా ప్రజల్లో అవినీతి తగ్గుతుందన్న నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయి. కొన్నిసార్లు ఏసీబీ అధికారులు కావాలనే నిర్లక్ష్యం వహిస్తున్నారని, సరైన సాక్ష్యాలు సేకరించడం లేదని ప్రజలు భావిస్తున్నారు. రాజకీయ ఒత్తిడి, ఉన్నతాధికారుల జోక్యం కారణంగా కొన్ని ముఖ్యమైన కేసులను నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు కూడా తరచూ వినిపిస్తున్నాయి. ఏసీబీకి మరింత స్వతంత్రత కల్పించకపోతే, అది కేవలం చిన్నపాటి అధికారులపై మాత్రమే దాడులు చేసి, వ్యవస్థలోని పెద్ద తలకాయలను వదిలిపెడుతుందనే అపనమ్మకం ప్రజల్లో ఏర్పడుతుంది. అవినీతి పెరగడానికి మరొక ముఖ్య కారణం పారదర్శకత మరియు జవాబుదారీతనం లేకపోవడం. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ పనికి ఎంత సమయం పడుతుంది, ఏ పత్రాలు అవసరం, ఎంత ఖర్చు అవుతుంది వంటి వివరాలు ప్రజలకు తెలియవు. దీనివల్ల అధికారులు ప్రజలను తమ ఇష్టం వచ్చినట్లు తిప్పుకొని, లంచాలు డిమాండ్ చేయడానికి వీలు కలుగుతుంది. ఆన్‌లైన్ సేవలు, జవాబుదారీతనం కలిగిన విధానాలు అవినీతిని అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రభుత్వ విధానాలను మరింత సరళతరం చేయకపోతే, ప్రతి అడుగులోనూ ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయి. అవినీతిని నిరోధించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు ప్రజలకు స్పష్టంగా తెలియజేయకపోవడం కూడా ఈ సమస్యను మరింత క్లిష్టతరం చేస్తోంది.

ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే, కేవలం అరెస్టులతో సరిపోదు. దీనికి బదులుగా, ఒక సమగ్రమైన ప్రణాళిక అవసరం. వేగవంతమైన న్యాయ ప్రక్రియ కోసం అవినీతి కేసులను పరిష్కరించేందుకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసి, త్వరితగతిన విచారణ జరిపి శిక్షలు విధించాలి. అవినీతికి పాల్పడిన ఉద్యోగులను నిర్ధారించిన తర్వాత, ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించడం ద్వారా వారిలో భయాన్ని పెంచాలి. ఏసీబీకి సంపూర్ణ స్వతంత్రత ఇవ్వడం ద్వారా రాజకీయ జోక్యం లేకుండా, కేసులను నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయడానికి వీలు కల్పించాలి. చివరిగా, పారదర్శక విధానాలను అమలు చేయాలి. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పనులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచాలి. ప్రజలు కూడా లంచాలు ఇవ్వడానికి నిరాకరించి, అవినీతికి వ్యతిరేకంగా తమ గొంతుకను బలంగా వినిపించినప్పుడే, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. లేకపోతే, ఏసీబీ ఎన్ని దాడులు చేసినా, ఎంత మందిని అరెస్టు చేసినా, అవినీతి అనేది ఒక చీడపురుగులా సమాజాన్ని పట్టి పీడించడం కొనసాగుతూనే ఉంటుంది.

**వెంక గారి భూమయ్య**

సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ
9848559863



# గాంధీ అంబేద్కర్ ల ఆశయాలను సాధిద్దాం...

# భారత్ సామాజిక విప్లవ పోరాట ఐక్యవేదిక.!!






**తెలంగాణ సేన న్యూస్ :** హైదరాబాద్ సోమాజిగూడలో జై భారత్ సామాజిక విప్లవ రణభేరి గాంధీ-అంబేద్కర్ ల ఆశయాలు సాధిస్తాం! రాష్ట్రంలో మనువాదాన్ని, మతోన్మాదాన్ని అంతం చేస్తాం-!!రణభేరి రాష్ట్ర కన్వీనర్ డా. ముప్పారం ప్రకాశం.జైభారత్ రణభేరి పేరిట 100 సభలు పోస్టర్ల, కరపత్రాల ఆవిష్కరణ అంబేద్కర్, గాంధీజీల మధ్య సమాజంలో నెలకొన్న అబద్ధాలను బద్దలుకొట్టడానికి, మనువాదానికి, మత విద్వేషానికి వ్యతిరేకంగా జైభారత్ సామాజిక విప్లవ రణభేరి పనిచేస్తోందని రణభేరి రాష్ట్ర రీ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ ఖదిజ్ఞాసి డాక్టర్ ముప్పారం ప్రకాశం అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో పోస్టర్ల, కరపత్రాల ఆవిష్కరణ అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా ‘గాంధీ %-% అంబేద్కర్ల ఆశయాలు సాధిద్దాం! మనువాదాన్నీ, మతోన్మాదాన్నీ అంతం చేద్దాం!’ లక్ష్యంతో జైభారత్ సామాజిక విప్లవ రణభేరి పేరిట 100 బహిరంగ సభలు నిర్వహిస్తున్నమని అన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 17 తారీఖున మొదటి సభ జోగిపేట్ లో నిర్వహిస్తున్నామని అన్నారు. రణభేరి రాష్ట్ర రీ ఆర్గనైజింగ్ కమిటీ కో కన్వీనర్ ఖదిజ్ఞాసి జీవన్ జోయెల్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల స్వార్థానికి ఎస్సీలు, బీసీలు, ఎస్టీలు ప్రతీఘాత విష శక్తుల పదాతి దళంగా మారవద్దు అని..సామాజిక విప్లవ సమర వీరులుగా పోరాడుతామని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జైభారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసి రజని మాట్లాడుతూ ఈ రోజు దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కులోన్మాదం, మతోన్మాదం అని.. ఈ సమస్యలపై జైభారత్ పోరాటం చేస్తోందని అన్నారు. దేశంకోసం తృణప్రాయంగా ప్రాణాలర్పించిన గాంధీజీని మతోన్మాదులు దేశానికి శత్రువుగా చిత్రీకరిస్తున్నారని అన్నారు. దీన్ని జైభారత్ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. ఆర్ ఎస్ ఎస్ మొదటి నుండి కుల వ్యవస్థ కు అనుకూలంగా... మనువాదానికి మద్దతుగా నిలవడం సిగ్గుచేటని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ లు రిజర్వేషన్ల కి వ్యతిరేకం అని అన్నారు.జైభారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసి లోక్ నాథ్ మాట్లాడుతూ.అలాగే పూనా పాక్ట్ విషయంలో గాంధీజీ పట్ల ఎస్సీ సమాజంలో ఉన్న అపోహలను సంపూర్తిగా తొలగించేందుకు... గాంధీ, అంబేద్కర్ లు శత్రువులు కారు అనడానికి రణభేరి సభలు ఒక చరిత్రగా నిలుస్తాయని అన్నారు. గాంధీ చేసిన దీక్ష రిజర్వేషన్లకి వ్యతిరేకం కాదు.. కేవలం విడి నియోజకవర్గాలకు మాత్రమే వ్యతిరేకం అని అన్నారు. అలాగే విడి నియోజక వర్గాల ద్వారా కేంద్ర అసెంబ్లీ లో దళితుల సీట్లు 71 నుంచి 148కి పెరిగిన విషయాన్ని గుర్తు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జైభారత్ జాతీయ ఉపాధ్యక్షులు ఖదిజ్ఞాసి వంశీ, జైభారత్ రాష్ట్ర అధ్యక్షులు కోల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి ఖదిజ్ఞాసి రాజు, ఎస్సీ పోరాట వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి గణేష్ గల్లా, జైహో రాష్ట్ర అధ్యక్షులు ఖదిజ్ఞాసి దున్న లక్ష్మేశ్వర్, బీసీ పోరాట వేదిక రాష్ట్ర నాయకులు లావణ్య సుదీర్, కొత్త ప్రభాకర్ గౌడ్, మాల మహానాడు సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అందోల్ మల్లేషం, భీం సోల్జర్స్ రాష్ట్ర అద్యక్షులు శేకర్ పల్పనూరి, మానవ హక్కుల సంఘం రాష్ట్ర సభ్యులు పోలే నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత విగ్రహ ఆవిష్కరణకు సిఐ రవి కుమార్ కు ఆహ్వాన పత్రిక అందజేత



**తెలంగాణసేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చేనేత విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా ఆహ్వాన పత్రాన్ని గజ్వేల్ సిఐ రవి కుమార్ కు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఆహ్వాన పత్రికను అందజేసిన పద్మశాలి సంఘం నాయకులు ఈ సందర్భంగా పద్మశాలి సంఘం సీనియర్ నాయకుడు మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ మాట్లాడుతూ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గజ్వేల్ లో ఏర్పాటుచేసిన చేనేత విగ్రహం గురువారం అనగా 7- 8 - 2025 రోజున ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా గజ్వేల్ సిఐ రవికుమార్, పోలీస్ సిబ్బందికి ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగిందని, చేనేత విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు రాజారాం, యువజన అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, కొండపోచమ్మ దేవాలయం డైరెక్టర్ గుండు లక్ష్మణ్,మార్కండేయ దేవాలయం అధ్యక్షుడు ఆంజనేయులు, గాడిపల్లి బలరాం, విజయ్ , రాజేశం, శ్రీనివాస్,ఆడెపు బాలచంద్రం,మల్లేశం, శివ కుమార్,పద్మశాలి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# గడ్డెన్న వాగు ప్రాజెక్ట్ నీటి విడుదల చేసిన ఎమ్మెల్యే



**భైంసా:ఆగష్టు 05:తెలంగాణ సేన న్యూస్. :** గడ్డెన్న వాగు ప్రాజెక్ట్ ప్రధాన కాలువ ద్వారా సాగు నీటిని మంగళవారం ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ విడుదల చేసారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి లో నిండక పోయినప్పటికీ ప్రస్తుతం వరి నాట్ల సమయం కావడం తో రైతుల సమస్య ను దృష్టిలో ఉంచుకోని నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. కుంసరా, కామోల్, పుస్పూర్, తో పాటు పలు గ్రామాల రైతులకు నీటి విడుదల వల్ల ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వర్షాలు పుష్కలంగా కురిసి ప్రాజెక్ట్ లు చెరువు లు నిండి పంటలు పండాలని అయన ఆకాంక్షించారు. కార్యక్రమం లో ప్రాజెక్ట్ ఇ. ఇ. అనిల్, మాజీ ఎం. పి. పి. రజాక్, సీనియర్ నాయకులు సొలంకి భీమ్ రావ్ పటేల్, పి. ఎ. సి ఎస్ డైరెక్టర్ వద్నపు శ్రీనివాస్, బిజెపి పట్టణ అధ్యక్షులు రావుల రాము, నాయకులు రావుల పోశెట్టి, పండిత్ రావ్ పటేల్, తుమ్మెల్ల దత్తాత్రి,అనిల్, తో పాటు ముధోల్, లోకేశ్వరం మండల నాయకులు పాల్గొన్నారు.

# శాకాంబరి మాత అవతారంలో మహంకాళి అమ్మవారు



**తెలంగాణసేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం అమ్మవారిని శాకంబరి మాత అలంకరణలో తీర్చిదిద్ది విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్న ప్రసాదం అందజేశారు, శాఖంబరి అమ్మవారి అలంకరణకు కూరగాయలు అందజేసిన కూరగాయల రాంబాబు దంపతులను సన్మానించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేసిన ఆలయ ప్రధాన అర్చకులు నంద బాల శర్మ దంపతులు అనంతరం వారు మాట్లాడుతూ శ్రీ మహంకాళి అమ్మవారి కరుణాకటాక్షాలతో అందరూ బాగుండాలని శ్రావణమాసంలో దైవారాధన చేస్తే పుణ్యం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయని మహంకాళి ఆలయంలో శ్రావణమాసం పూజలు వైభవంగా కొనసాగుతున్నాయని, భక్తుల కోరిన కోర్కెలు నెరవేర్చి కొంగుబంగారంగా వీర జిల్లుతున్న మహంకాళి అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని భక్తులను కోరారు

# ఏబీవీపీ ఆధ్వర్యంలో నర్సంపేటలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



**నర్సంపేట తెలంగాణ సేన :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వరంగల్ జిల్లా నర్సంపేట శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ కళాశాలల్లో రక్షాబంధన్ సందర్బ ంగా ముందస్తుగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ వరంగల్ జిల్లా కన్వీనర్ బానోత్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ రక్షాబంధన్ సంవత్సరంలో ఒక్కసారి వచ్చే పండుగ అని, ఈ పండుగను ఒకరికి ఒకరు కష్ట సుఖాల్లో రక్షణగా ఉంటామని ప్రమాణం చేస్తూ ఒకరికి ఒకరు రాఖీలు కట్టుకుంటారు అని అన్నారు, చాలా మంది రక్షాబంధన్ కేవలం అన్నా చెల్లెళ్ళకు మాత్రమే ప్రత్యేకమయినది అని భావిస్తారు కానీ ఈ రాఖీ నీ ఎవరికి ఎవరు అయినా కట్టుకోవచ్చు ఇది కేవలం ఇరువురి రక్షణకు సంబంధించిన పండుగ అని అన్నారు, భార్య భర్తలు, అన్నా చెల్లెలు, స్నేహితులు మరియు ఇంకా అందరూ కట్టుకోవచ్చు అని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలోసంతోష్, ఓం ప్రకాష్,గణేష్,జగన్, విద్యార్థులు, అధ్యాపకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడ నూతన ఎస్ఐగా రాజ్ కుమార్ .




**కొత్తగూడ తెలంగాణ సేన :** మహబూబాబాద్ జిల్లా: కొత్తగూడ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై రాజ్ కుమార్ కాలేశ్వరం ప్రాజెక్ట్ పైన మాజీ మంత్రి హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నర్సంపేట తెలంగాణ సేన : కాలేశ్వరం ప్రాజెక్టుపైన మాజీ మంత్రి హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వీక్షిస్తున్న మాజీ శాసనసభ్యులు పెద్ది,చల్లా మరియు జిల్లా పార్టీ నాయకులు.... కాలేశ్వరం ప్రాజెక్టు పైన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారం పైన ఈ రోజు వరంగల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో యస్‌యస్ గార్డెన్ ఊకల్ లో ఏర్పాటుచేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ గౌరవ మాజీ మంత్రివర్యులు హరీష్ రావు చే నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి హాజరైన వరంగల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి చల్ల ధర్మారెడ్డి మరియు జిల్లా పార్టీ ముఖ్య నాయకులు.

# కాలేశ్వరం ప్రాజెక్ట్ పైన మాజీ మంత్రి హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

## నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



**నర్సంపేట తెలంగాణ సేన :** కాలేశ్వరం ప్రాజెక్టుపైన మాజీ మంత్రి హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వీక్షిస్తున్న మాజీ శాసనసభ్యులు పెద్ది,చల్లా మరియు జిల్లా పార్టీ నాయకులు..లేశ్వరం ప్రాజెక్టు పైన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారం పైన ఈ రోజు వరంగల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో యస్‌యస్ గార్డెన్ ఊకల్ లో ఏర్పాటుచేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ గౌరవ మాజీ మంత్రివర్యులు హరీష్ రావు చే నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి హాజరైన వరంగల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి చల్ల ధర్మారెడ్డి మరియు జిల్లా పార్టీ ముఖ్య నాయకులు.

# కిరాణా వర్తక సంఘం 60వ వార్షిక దినోత్సవం





**నర్సంపేట తెలంగాణ సేన :** అధ్యక్షులు దాసరి నరసింహారెడ్డి స్థానిక నర్సంపేట పట్టణం యందు ఈరోజు మంగళవారం 05 ఆగస్టు 2023 రోజున నర్సంపేట పట్టణం యందు కిరాణా వర్తక సంఘం నూతన కార్యాలయ భవనం ఏర్పాటు చేసుకోగా పట్టణంలో 69 మంది వ్యాపారస్తులు కుటుంబ సమేతంగా పాల్గొనగా 60వ సంవత్సరపు వార్షికోత్సవం విజయవంతం చేసుకోవడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో అధ్యక్షులు దాసరి నరసింహా రెడ్డి మాట్లాడుతూ గతంలో 1965 సంవత్సరంలో కొనసాగుతున్న వ్యాపారంలో కిరాణం, బట్టల వ్యాపార సంఘాలు కలిసి వ్యాపారం కొనసాగా కొద్ది కాలంలో రెండు విడివిడిగా విభజన చెందగా కిరాణా వ్యాపార వర్తక సంఘం కొనసాగుతూ 2005 సంవత్సరం నుండి 2025 ఇప్పటివరకు ఏకగ్రీవంగా అధ్యక్ష ఉపాధ్యక్ష ప్రధాన కార్యదర్శి పదవిలో కొనసాగుతున్నందు తోటి వ్యాపారస్తులను అభినందిస్తూ చిట్టిల మాదిరి రూపాయలు జమ చేస్తూ మంగళవారం వ్యాపార సూచనలు క్రమశిక్షణ పద్ధతిలో పాటిస్తూ అట్టి పొదుపు డబ్బులు వచ్చే ప్రతి సభ్యునికి భూమి ప్లాట్లు కొనుగోలు చేస్తూ ప్రతి కిరాణం వ్యాపారస్తుల కుటుంబాల యందు అనేక వసతులలో సంఘం లబ్ధిపరుస్తూ వ్యాపారంలో ప్రభుత్వ సూచన మేరకు చట్టపరమైన విధులు నిర్వహిస్తూ ప్రభుత్వం చే ఎలాంటి కోర్టు శిక్ష లేకుండా 25 సంవత్సరాలుగా సంఘం కొనసాగుతుందని అన్నారు తదుపరి ప్రతి సంఘం సభ్యులు దంపతులకి నూతన వస్త్రాలతో మెమొంటలతో సన్మానించగా మిఠాయిల పంపిణీతో ఆనందం వ్యక్తపరిచారు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న వారు దాసరి నరసింహారెడ్డి పుట్టా రామస్వామి సోల్తి చిన్న సాంబయ్య గందె శ్రీనివాస్ గుప్తా వజీనేపల్లి లక్ష్మయ్య బుస్సా బిక్షపతి పుల్లూరి లక్ష్మీనారాయణ అడ్వకేట్ లక్ష్మీనారాయణ సోల్తి వెంకట రాజ్ కుమార్ బండి వేణు పుల్లూరి వేణు గాదగోని బిక్షపతి గౌడ్ శ్రీ రాముల పోశెట్టి స్వామి కొడకండ్ల శ్రీధర్ సింగిరికొండ మనోహర్ మల్యాల నవీన్ కుమార్ రాచర్ల నాగరాజు మల్యాల రాజు బీరవెల్లి శంకర్ లింగం కుసుమ సూరయ్య ఆడెపు రవీందర్ చిమ్మని రాజు బూర నరేష్ దుబ్బా రమేష్ శిలగాని సురేష్ కె ఆర్ కబీర్ గౌడ్ బొప్పరాతి సురేందర్.

# జర్నలిస్ట్ అక్రమ నిర్బంధం పై సీపీకి జర్నలిస్టుల పిర్యాదు

## శాంతిభద్రతల పరిరక్షణలో జర్నలిస్టుల సహకారం అవసరం

## మెరుగైన సమాజం కోసం కలసి పని చేయాలి సీపీ సీవీ ఆనంద



హైదరాబాద్, తెలంగాణ సేన ఆగస్టు 5: ఛోటా న్యూస్ యాప్ పైన కేసును నమోదు చేయడంపైన, అదే విధంగా సికింద్రాబాద్ బిగ్ టీవీ జర్నలిస్టు నర్సింగ్ రావును అన్యాయంగా నిర్బంధించడంపై జర్నలిస్టులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్టులు, నార్త్ జోన్ జర్నలిస్టుల ప్రతినిధి బృందం, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ను కలిసి పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీపీ స్పందిస్తూ కేసును తొలగిస్తామని హామీ నివ్వడంతో పాటు మరొక్కసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. సీపీ మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసుల పాత్రతో పాటు జర్నలిస్టుల సహకారం కూడా ఎంతైనా అవసరమని తెలిపారు. వార్తా ప్రసారంలో సమ్యమానం పాటించాలని, వీడియోల ప్రసారంలోను సున్నితమైన అంశాల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ వాస్తవాల ఆధారంగా ప్రచురించిన చోటా న్యూస్ అప్‌పై ఇలా క్రిమినల్ కేసు నమోదు చేయడం మీడియా స్వేచ్ఛను హరించడమేనని సీపీ దృష్టికి తీసుకువచ్చారు. ఇకపై ఇటువంటి సంఘటనలు పునరావృతం చూడాలని కోరారు. సీపీ స్పందన పట్ల జర్నలిస్టులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పలు ప్రముఖ మీడియా సంస్థల ప్రతినిధులు గోపి యాదవ్, నగేష్, కునాల్, సురేష్, రత్న కుమార్, రాఘవ, ప్రవీణ్, నార్త్ జోన్ జర్నలిస్టులు రమేష్, నర్సింగ్, శ్రీకాంత్, బాలకృష్ణ, నరేష్, వంశీ, వాసు, మల్లికార్జున్, శ్రీనివాస్, భాగ్యనగర్ జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం, ప్రధాన కార్యదర్శి చందు, పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డు ఇవ్వాలి

## అమరవీరుల కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాలి

## ఎన్నికల లోపే సీఎం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

## . ప్రభుత్వంకు వినతి

## సుల్తాన్ యాదగిరి, టి యు జేఏసీ చైర్మన్



**హైదరాబాద్, తెలంగాణ సేన :** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి అన్నారు. మంగళవారం హైదరాబాద్ ప్రజా భవన్ వద్ద టి యు జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి ఆధ్వర్యంలో ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలంటూ చిన్న రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంకు సుల్తాన్ యాదగిరి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని, 250 గజాల స్థలం లో ప్రతీ ఉద్యమకారుడికి ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అమరవీరుల పేరు మీద 100 ఎకరాల్లో స్మృతి వనం నిర్మించి ఇవ్వాలని, మలి దశ ఉద్యమంలో అమరులైన కుటుంబాలలో కొందరికే సహాయం అందిందని మిగితా కుటుంబాలకు రూ. 10 లక్షల నగదుతో పాటు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్వరాష్ట్ర పోరాటం లో ఉద్యమ కారులు చదువులు, కొలువులు, ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. త్యాగాల పునాదుల పై అధికారంలోకి వచ్చిన కెసిఆర్ ఉద్యమకారులను విస్మరిం చారని తెలిపారు. ఉద్యమకారుల సమ స్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కే రాజేంద్ర ప్రసాద్, డోలక్ యాదగిరి, మోత్కూరి మల్లేష్, గుండా యాదగిరి, ఏలూరి బాబన్న, గాజుల యాదగిరి, విజయలక్ష్మి, చిలుక శారదా, సుగుణమ్మ, చంద్రకళ, గంగిరాజు,గుండమల్ల శ్రీను, కోటేశ్వరరావు, ఎన్ స్వరూప, బి లక్ష్మి చారీ, గంధ మల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అల్లుడిని చంపిన అత్త!

## మద్యం తాగొచ్చి గొడవ..

## కర్రతో దాడి చేయడంతో స్పాటెడ్

## తరోడాలో ఘటన



**ముధోల్:ఆగష్టు 05:తెలంగాణ సేన న్యూస్. :** ముధోల్: అల్లుడిని అత్త చంపిన ఘటన నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలో సంచలనంగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా హిమాయత్ నగర్కు చెందిన షేక్ నజీమ్ (45) కుటుంబం ఇటుక బట్టీల పని కోసం వచ్చి తెల్లతరోడా గ్రామంలో స్థిరప డింది. వర్షాకాలం నేపథ్యంలో పని లేకపోవడంతో షేక్ నజీమ్ భార్య నిన్న తమ పిల్లల్ని తీసుకొని వేరే గ్రామానికి పని కోసం వెళ్లింది. ఇంట్లో షేక్ నజీమ్, అత్త రహీమున్నీసాతో ఇంటే వద్దే ఉండగా మద్యం తాగొచ్చిన నజీమ్ రాత్రి అత్తతో గొడవకు దిగాడు. ఈ క్రమంలోనే ఆమె కర్రతో అల్లుడిపై దాడి చేయడంతో నజీం అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందడంతో పోలీసులు ఇవాళ ఉదయం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. నజీమ్ భార్య తన తల్లిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**ముధోల్, 05 ఆగస్టు (తెలంగాణసేన న్యూస్) :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు కా ర్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాల ని ముధోల్ నియోజకవర్గ కాం గ్రెస్ పార్టీ ఇంచార్జీ, మాజీ ఎ మ్మెల్యే బోస్లే నారాయణ రావు పటేల్ అన్నారు. మంగళవారం బైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూత నంగా సేవాదళ్ ముధోల్ మం డల అధ్యక్షునిగా ఎన్నికైన కం కాపురం అనిల్ కు నియామక పత్రాన్ని అందజేశారు. దీంతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చే స్తున్న అభివృద్ధి పనులపై పల్లె ల్లో అవగాహన కల్పించాలన్నా రు. కాంగ్రెస్ పార్టీ నిరుపేదల ప్రభుత్వమన్నారు. ఈ సంద ర్భంగా సేవాదళ్ మండల అ ధ్యక్షుని ఎన్నుకోవడంతో అని ల్ కాంగ్రెస్ పార్టీకి, బోస్లే నారా యణరావు పటేల్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీపై నమ్మకంతో సేవాదళ్ అధ్యక్షునిగా పదవి దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నా రు. పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తానని పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నూతన సేవాదళ్ అధ్యక్షునికి అభినందనలు తెలిపారు

# ఆలయ నిర్మాణానికి విరాళం అందజేసిన రాళ్ల బండి బాలకృష్ణ



**సిద్దిపేట జిల్లా** మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయానికి మంగళవారం కర్కపట్ల గ్రామ బిఆర్ఎస్ యువ నాయకుడు రాళ్ల బండి బాలకృష్ణ ఆధ్వర్యంలో 1,25,000 రూపాయలు విరాళం అందజేశారు ఈ సందర్భంగా పాక్స్ వైస్ చైర్మన్ బాలరాజు మాట్లాడుతూ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కరుణాకటాక్షాలతో అందరూ బాగుండాలని గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా ఆలయంలో టైల్స్ వేయడానికి రాళ్లబండి బాలకృష్ణ 1,25 000 విరాళం వారి పుట్టినరోజు సందర్భంగా అందజేయడం సంతోషంగా ఉందని రాళ్ల బండి బాలకృష్ణ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ముక్కోటి దేవతలు అనుగ్రహం వారికి, వారి కుటుంబానికి ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ, ఆలయ నిర్మాణానికి సహకరించేవారు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులను సంప్రదించాలని కోరారు,

# అంగడిపేట్ హనుమాన్ దేవాలయం వద్ద అన్నదానం




**తెలంగాణసేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ అంగడిపేట హనుమాన్ దేవాలయం వద్ద మంగళవారం ధనలక్ష్మి క్యాటరింగ్ యజమాని లక్ష్మీ కుటుంబ సభ్యుల సౌజన్యంతో పులిహోర పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్ మాజీ ఉప సర్పంచ్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ అన్నదానం మహాదానమని ప్రతి మంగళవారం పులిహోర పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ధనలక్ష్మి క్యాటరింగ్ వారి సౌజన్యంతో పులిహోర పంపిణీ చేయడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడు సిద్ది బిక్షపతి, ఇటిక్యాల తాజా మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల భద్రయ్య, కొండ పోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ అయిత సత్యనారాయణ, కైలాస ప్రశాంత్, సిద్ది రామచంద్రం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మెద రెక్కల మీద ముప్పన్నెవిల్లుల ఆకాశం




1. ఏ పాలపుంతల్ని దాటొచ్చావో కానిఇంతకుముందెన్నడూ మేమెరుగని పిల్లనగ్రోవులపంటవు నువ్వు. లోకం వెంట లోకాన్ని దించి మాకు పల్లకీలు కట్టించిన మెరుపులచెండువు నువ్వు... మడతలు విప్పుకున్న పద్యాలుగా మమ్ము విప్పార్చిన మొగలీసంపెంగల మహోత్సవానివి కదూ నువ్వు

2. ఆ అనిమేష వీక్షణాల నిండా విరగబూచే తీగ సంపెంగల పందిరి పరిచి ఆ పందిళ్ల నిండా నన్నొక చిన్నిచిన్ని పిట్టలగుంపును చేసి%- తీరొక్కరాగాల కోలాటాలాడించి పాడడమే ఎరుగని నన్నెంత మహాగాయకుణ్ణి చేసి ఆహా.. ఎన్ని కచేరీలు చేయిస్తున్నావో

3. నీ ఆ పెదవి అంచున విరుపులో దోగాడే పసిసిగ్గు వేలవేల కలువరాయళ్లను దూసిపోస్తూ ఆకాశాల్ని అరచేతికందిస్తుంటే కొత్తపాటల్ని కట్టుకుంటూ ఎన్నిసార్లు కొత్తమొదళ్లమైపోతున్నా ఎఇంకేదో వెలితిలో ఈ చిన్నిగుండెల్ని జోలెలుగా పట్టి నీ కనురెప్పలవాకిట భిక్షకులం కావడం ఎంతటి మహదానందంగా ఉందో

4. నువ్వే దేవభాషను మాట్లాడుతుంటావో తెలీదుకానీ నీతో సంభాషించడానికి మా వర్ణమాలనంతా మరచిపోయి లిపికందని ఏదో మధురభాషతో నీతో పోటీపడుతున్నా నీ కేరింతలు, ఉంగా, ఊ లతో దేహాన్నంతా చిత్రభాషగా మలచి చిత్తుగా ఓడించేస్తుంటే మనసును చెంగుపట్టి రోజూ వంద ఓటముల్ని ఎత్తుకోవడానికైనా మేం తయారే.

5. ఈ ప్రపంచమింకా బతికుందనడానికి ఈ నేల ఇంకా నవ్వుతూనే ఉందనడానికి ఈ గాలి ఇంకా కలల తొక్కిసలాటలో పండుతూనే ఉందనడానికి కాలం ఇంకా మమ్మల్ని పలకరిస్తూనే ఉందనడానికి ఒకే ఒక్క నిదర్శనం చివుళ్లుతొడిగే కొత్తలోకాల్ని కుక్కి కుక్కి మోసుకొచ్చిన ను.. వ్వే.. గా.

6. మేమూ, కాలం అదిగో ఆ రైలుపట్టాల్లా ఎప్పుడూ ఎడమెడమే అదిగో అక్కడెక్కడో మలుపులో మా దూరాల్ని బద్ధలుకొడుతున్నట్లున్న ఆ దవ్వుల్లో- ఇప్పటికైతే- మా జుగల్‌బందీకి వేదికా నువ్వే , వాద్యమూ నువ్వే గాత్రమూ నువ్వే, గానమూ నువ్వే ముగింపన్నదే లేని కచేరీ నువ్వే

7. ఇసుకకొండల్లా ఎండకాగుతున్న మమ్మల్ని మళ్లీ నదుల్ని చేసిన చిలుకపాటల చిరుజలపాతం లాంటి నీ జలతారునవ్వులు, నేరుగా చందమామలోంచి రా సెలయేళ్లలో ఈత కొట్టొచ్చిన సమీరాల్లాంట నీ తేనెచూపులు తుంచిపోస్తున్న కాశ్మీరాల్లో తూలీ, సోలీ చుక్కల్ని కోసుకున్న మైకంలో- ఓ కొండపల్లిబొమ్మా.. నీకెంత కవిత్వాన్ని బాకీ పడిపోతున్నానో! -యార్లగడ్డ రాఘవేంద్రరావు.

## కొబ్బరి నీళ్లు ఎన్ని తాగాలి?



కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మేలని అందరికీ తెలిసిందే. ఎవరికైనా చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా

కొబ్బరి నీళ్లు తాగమని సలహా ఇస్తుంటారు. రోగాలతో ఉన్నవాళ్లకే కాదు ఆరోగ్యంగా ఉన్నవాళ్లకూ ఇందులో ఉండే పోషకాలు అవసరమే. అయితే, అధికంగా పోషకాలు ఉండే కొబ్బరి నీళ్లను ఎన్ని తాగాలి? ఎన్నిసార్లు తాగాలో అవగాహన తక్కువే! పరిమితిని మించితే ఔషధం కూడా వికటిస్తుంది. ఎక్కువ మోతాదులో లవణాలు ఉండే కొబ్బరి నీళ్లను పరిమితంగా తాగడమే మేలని చెబుతున్నారు నిపుణులు. కొందరైతే.. కొబ్బరినీళ్లు లీటర్ బాటిల్ కొని గటగటా తాగేస్తుంటారు. ఇంకొందరు రెండుసార్లు విరామం ఇస్తూ లీటర్ పట్టిస్తారు. అన్నేసి కొబ్బరినీళ్లు తాగితే.. కిడ్నీలు, ఇతర అవయవాలపై భారం పడుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఒకసారి 150-200 మిల్లీలీటర్లు తాగితే సరిపోతుందని సలహా ఇస్తున్నారు. ఆరోగ్యవంతులు వారంలో మూడు నుంచి నాలుగుసార్లు కొబ్బరినీళ్లు తాగొచ్చు. అది కూడా ఉదయం, సాయంత్రాల్లో శారీరక శ్రమ చేసిన తర్వాత లేదా వ్యాయామం ముగించిన తర్వాత కొబ్బరి నీళ్లు తాగడం మేలు! కొబ్బరి నీళ్లలో ఉండే పొటాషియం రక్తపీడనాన్ని నియంత్రణలో ఉంచుతుంది. శరీరానికి కావాల్సిన గ్లూకోజ్‌ను వేగంగా అందిస్తుంది. కాళ్ల తిమ్మిర్లు

## రోజుకు అసలు ఎన్ని కప్పుల గ్రీన్ టీని తాగాలి.. ఏ సమయంలో తాగితే మంచిది..?



ఆరోగ్యంగా ఉండాలని చెప్పి ప్రస్తుతం చాలా మంది గ్రీన్ టీని సేవిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది గ్రీన్ టీని అధికంగా తాగుతుంటారు. చైనా సంప్రదాయ వైద్యంలోనూ గ్రీన్ టీని తాగమని సూచిస్తుంటారు. గ్రీన్ టీలో అనేక సమ్మేళనాలు ఉంటాయి. ఇవి మనకు ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందిస్తాయి. గ్రీన్ టీని రోజూ తాగడం వల్ల పలు వ్యాధులు సైతం నయమవుతాయి. అయితే గ్రీన్ టీ తాగుతాం, బాగానే ఉంటుంది, కానీ రోజుకు ఎన్ని కప్పులు తాగాలి, ఏ సమయంలో తాగాలి.. అని చాలా మంది సందేహిస్తుంటారు. ఇందుకు పోషకాహార నిపుణులు ఏమని సమాధానాలు చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. గ్రీన్ టీ అనేది ఎవరి ఆరోగ్య స్థితిని బట్టి వారు తాగాల్సి ఉంటుంది. కొందరు ఎక్కువ కప్పులు తాగినా పెద్దగా ప్రభావం ఉండదు. కొందరు ఒక కప్పు కూడా తాగలేకపోతారు. కనుక అలాంటి వారు గ్రీన్ టీకి దూరంగా ఉండడమే మంచిది.

**3 కప్పుల వరకు..**

సాధారణంగా ఎవరైనా సరే రోజుకు 1 నుంచి 3 కప్పుల వరకు గ్రీన్ టీని తాగవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల గుండె పోటు రాకుండా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. పలు అధ్యయనాలు చెబుతున్న ప్రకారం రోజుకు 3 కప్పుల వరకు గ్రీన్ టీని సేవిస్తుంటే క్యాన్సర్లు వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని తేలింది. మెదడు ఆరోగ్యంగా ఉంటుంది. షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఒక కప్పు గ్రీన్ టీలో సాధారణంగా 50 మిల్లీగ్రాముల వరకు కెఫీన్ ఉంటుంది. అమెరికాకు చెందిన ఎఫ్‌డీఏ చెబుతున్న ప్రకారం ఒక వ్యక్తి రోజుకు 400 మిల్లీగ్రాములకు మించి కెఫీన్‌ను తీసుకోకూడదు. అంటే 8 కప్పుల వరకు గ్రీన్ టీ తాగవచ్చని అర్థం వస్తుంది. కానీ ఒక వ్యక్తి రోజుకు 8 కప్పుల వరకు గ్రీన్ టీని సేవించలేరు. కనుక 3 కప్పులకు పరిమితం చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.


**ఈ సమయంలో అయితే..**


ఇక గ్రీన్ టీని రోజులో ఏ సమయంలో సేవించాలని కూడా చాలా మంది సందేహిస్తుంటారు. గ్రీన్ టీని ఆహారం తినడానికి 1 గంట ముందు లేదా గంట తరువాత తాగాలి. లేదంటే మనం తిన్న ఆహారంలో ఉండే ఐరన్, విటమిన్ సి వంటి పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకోలేదు. కనుక బ్రేక్ ఫాస్ట్ చేశాక గంట సేపు ఆగి తాగితే మంచిది. మధ్యాహ్నం లంచ్ అయ్యాక 1 గంట విరామం ఇచ్చి కూడా తాగవచ్చు. రాత్రి పూట మాత్రం సేవించకూడదు. ఇందులో ఉండే కెఫీన్ కారణంగా నిద్ర పట్టదు. రాత్రి పూట గ్రీన్ టీని తాగితే నిద్రకు ఆటంకం కలుగుతుంది. ఇలా గ్రీన్ టీని తాగితే అనేక లాభాలను పొందవచ్చు. గ్రీన్ టీని తాగడం వల్ల యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలించి గుండె పోటు, క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా చూస్తాయి.

**లాభాలు ఇవే..**

గ్రీన్ టీలో ఉండే కెఫీన్, ఎల్-థియానైన్ అనే అమైనో యాసిడ్ కారణంగా మెదడు ఉత్తేజంగా మారుతుంది. చురుగ్గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. బద్దకం పోతుంది. నిద్ర మత్తు వదిలిపోతుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. మెదడు యాక్టివ్‌గా పనిచేస్తుంది. గ్రీన్ టీని సేవించడం వల్ల మెటబాలిజం పెరుగుతుంది. దీంతో క్యాలరీలు ఖర్చువుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనే ప్రయత్నంలో ఉంటే రోజూ గ్రీన్ టీని తాగుతుంటే ఫలితం ఉంటుంది. గ్రీన్ టీలో పాలిఫినాల్స్ అధికంగా ఉంటాయి.

# సహస్ర వృత్తుల సమస్త చిత్రం






తలచుకోగానే ఎవరైనా కళ్లబడితే వారికి 'నిండు నూరేళ్ళు' అంటాం. అట్లా కాపు రాజయ్యకి నిండు ఆయుర్దాయం నేటికి నిండినదేమీ కాదు, మలిదశ తెలంగాణ ఉద్యమంలోనే వారి యాది సంపూర్ణం. శతాయువు మాత్రమే కాదు, వారు అనునిత్యం చిరంజీవి. అయితే ఇక ముందు వారి మరో అంకం సాగనుంది. అదే ఈ వ్యాసం సారాంశం. ఎవరైతే తమ గడుల్లో బలవంతంగా బతుకమ్మ ఆడించారో వారే బతుకమ్మ ఆడే స్థితి తెలంగాణ ఉద్యమం తేనే తెచ్చింది. వాళ్ళ మెడలు వంచి బతుకమ్మను, బోనాలను నెత్తిమీద పెట్టుకునేలా చేయనే చేసింది. అంతేకాదు, సకల జనుల సమిష్టి చేతనలోకి మన సాంస్కృతిక ఆనవాళ్ళు బలీయమై, ఉద్యమ ?సోయిలోకి వచ్చేసరికి మళ్ళీ సజీవ స్మృతిలోకి వచ్చి చేరిన రెండే రెండు బొమ్మలు, రాజయ్య గీసినవే. ఒకటి%-% సద్దుల బతుకమ్మ, రెండు బోనాలు, ఈ రెండు బొమ్మలు రాష్ట్ర పండుగలుగా అయ్యేనాటికి ఎంతో ముందు, అనేక దశాబ్దాల క్రితమే వారు ఆ ఉత్సవాలను అపురూపంగా పదిలపరిచారు. చిత్రమేమిటంటే, 'ఫక్తు రాజకీయాల దశ' పోయి 'ప్రజా పాలన' అని మూడో దఫా ప్రభుత్వం వచ్చేనాటికి తెలంగాణ తల్లి చేతుల్లో బతుకమ్మ మాయం అయి ఉండొచ్చు గాక. కానీ, ఆయన చేసిన పని అంతకుముందే పరిసమాప్తి అయింది. అవును, వారు చిత్రించి పెట్టిన ఆ రెండు బొమ్మలు చేయవలసిన పని చేశాయి. ఇప్పుడు మిగితావి కూడా బయలుపడతాయి. అదే శత జయంతి ఆన. నేటి (ఆగస్టు 3) సాయంత్రం హైదరాబాద్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కాపు రాజయ్య శత జయంతి ఉత్సవ సందర్భంగా కళా ప్రదర్శన ప్రారంభం. ఆగస్టు పది వరకూ ఉంటుంది. ఈ ప్రదర్శనలో బహుశా అనేక చిత్రాలు నూతన అంకురానికి ప్రేరేపణ ఇస్తాయనే నమ్ముతాను నేను. అవును, రాజయ్య సబ్బండ వర్ణాల చిత్రకారులు. వారు పండుగలు, పబ్బాలను మాత్రమే చిత్రించలేదు. నేడు బీసీ కుల గణన ద్వారా మొదటిసారిగా దేశవ్యాప్తంగా మెజారిటీ ప్రజగణన జరిగే తరుణం ఆసన్నమయ్యే సరికి వారు అసలైన ఉత్సవ రథాన్ని మన ముందుకు చేర్చనే చేర్చారు. ఆయన తీరొక్క కులాన్ని, వారి వ్యావృత్తులతో కూడి, కడు సుందరంగా ఎప్పుడో చిత్రించి ఉన్నారు. ఇకముందు వారి అన్ని చిత్రాలూ ఊరేగక మానవు. వెలికి తీయవలసిన సందర్భం ఇది. ఒక్క మాటలో భారతదేశ చిత్రకళా మండలంలోకి ఒకనాడు పరిపుష్టంగా తులతూగిన తెలంగాణ గ్రామాన్ని, అందలి మెజారిటీ కుల సముదాయాలను కాపు రాజయ్య ప్రతిక్షేపించి చూపినంత ఘనంగా మరొకరు చేయలేదు. వారు సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలను ఉపరితల మానకంగా వేయలేదు. ఆయా వృత్తిదారులను వారి పనిపాటలే రక్తమాంసాలతో తమవైన అచ్చట్లు ముచ్చట్లతో తమవైన అలంకారాలతో ఒక కోలాటంగా చిత్రించి పెట్టారు. నేడు వాటిని చూడటం అంటే వాంఛితంగా నైరూప్యం చేసిన మెజారిటీ ప్రజల గ్రామీణ జీవన ఉత్సవాన్ని తిరిగి వాస్తవికంగా దర్శించడమే. అదే ఇప్పటి కవి సమయం లేదా చిత్రకళా పునరుజ్జీవన సందర్భం.

అనేకులకు వారి బతుకమ్మ, బోనాలతో పాటు రాజయ్య గీసిన రాధాకృష్ణుల చిత్రం తెలుసు. చాలామందికి తాటి చెట్టు ఎక్కుతున్న గౌడ్ తాలూకు 'రిస్కీ లైఫ్' తెలుసు. కానీ, వారి కాన్వాసు పెద్దది. అందులో కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, బెస్త, స్వర్ణకారి, మేదరి, పద్మశాలీ, వడ్డెరలు, నకాషీలే కాదు, యాదవులు, దూదేకులు, రజకులు ఎందరో ఉన్నారు. పరమాత్మ, జీవాత్మలతో సహా ఇంకా ఎన్నో చిత్రించారు. నిజానికి వారు సహస్ర వృత్తుల సమస్త చిహ్నంగా చూపింది 'కళ'ను. అవును. కళే ఒక్కో కులానికి ఉన్న బహుజన ప్రజల అసలైన విద్యా ఉద్యోగ ఔపాధిక సంస్కృతి అని, అదే స్వరాజ్యం అని ఆయన చిత్రించారు. అదే రాజయ్య రాజరికం. నిజానికి బహుజన సమాజాన్ని, ఒక్కో సముదాయంగా తరతరాలుగా వారు చేపట్టి అభివృద్ధి చేసిన పనులను 'వృత్తులు' అనే చాలా మంది భావించారు. వాటిని 'హస్తకళలు' అనే మాట్లాడారు. కానీ రాజయ్య తన లలిత కళలో ఒక్కో కులాన్ని గొప్ప జీవకళగా అభివ్యక్తం చేసి చూపారు. ఒకరి చేతుల్లో ఒకరు చేయుంచి ఊరు ఉమ్మడిగా సకల కులాల సమ్మేళనంగా, తీరొక్క మనుషుల సమిష్టి జీవన గ్రామంగా ఆయన దేనికదే ఒక బొమ్మగా చిత్రించి పెట్టారు. అదే వారి 'కళా భవనం'. మరో మాటలో ఆయన గ్రామాన్ని తన జానపద చిత్తమూ చిత్రంతో పల్లకీ ఎక్కేలా చేశారు. ఆ బోయలే అందులో ఊరేగేలా చిత్రించారు. ధ్వంసం కాకముందరి గ్రామాన్ని, మనం కోల్పోయిన గ్రామ పునాదిని, అందలి నాగరికతలను వారు చూపినంత విశిష్టంగా ఇంతటి వైవిధ్యంతో దేశంలోనే మరే చిత్రకారుడూ చిత్రించలేదు. అందువల్లే రాజయ్య శత జయంతి ఉత్సవం ఒక్క తెలంగాణకు, తెలుగు రాష్టాలకు పరిమితం కారాదు, దేశంలోని బహుళ ప్రజానీకపు బతుకులకు ఈ వేడుక పునరుజ్జీవన కానుక. ఒక ఎరుక. గణన. అందుకే సరికొత్తగా అనడం, వారి కళ సహస్ర వృత్తుల సమస్త చిహ్నం అని. అది ఒకనాడు కేవలం బతుకమ్మ బొమ్మగానే కానవచ్చింది. కానీ నేడు వారి శత జయంతి సమయానికి, ఒక్కో కులానికి చెందిన వారి బొమ్మలన్నీ తీరొక్క పూల వంటి ఒక సాంస్కృతిక సమ్మేళనంగా, ఒక గణనీయమైన వైవిధ్యంగా మన ముందుకు వచ్చాయని. అదే దేనికదే నిజమైన 'బతుకమ్మ'. విభిన్న పండుగగా చూడాలి. ఇక వారి ఒక్కో బొమ్మను లెక్కించి చూడాలి. అదే వారికి మనమిచ్చే ఘనమైన నీరాజనం.

## మీకు ఈ నట్స్ గురించి తెలుసా..?

## రోజూ గుప్పెడు తినండి చాలు, ఎన్నో లాభాలను పొందవచ్చు..!



బాదంపప్పు, పిస్తా, జీడిపప్పు.. ఇలా చాలా రకాల నట్స్ గురించి మనకు తెలుసు. కానీ మీరు ఎప్పుడైనా టైగర్ నట్స్ గురించి విన్నారా..? వీటిని మీరు సూపర్ మార్కెట్లలో చూసే ఉంటారు. కానీ వీటి పేరు టైగర్ నట్స్ అని మీకు తెలిసి ఉండదు. ఇతర నట్స్ లాగే ఈ నట్స్ కూడా మనకు అందుబాటులో ఉన్నాయి. వీటిని కూడా మనం ఆహారంలో భాగం చేసుకోవచ్చు. టైగర్ నట్స్‌ను చుఫా లేదా ఎర్త్ ఆల్మండ్స్ అని పిలుస్తారు. అయితే ఇవి నట్స్ జాబితాకు చెందుతాయి. కానీ భూగర్భంలో పండుతాయి. ఈ నట్స్ మీద ముడతలు పడినట్లు తొక్క ఉంటుంది. ఇవి కాస్త తియ్యగా, క్రీమ్ రుచిని కలిగి ఉంటాయి. సాధారణ నట్స్ అంటే అలర్జీ ఉన్నవారు టైగర్ నట్స్‌ను తీసుకోవచ్చు. టైగర్ నట్స్‌ను రోజూ గుప్పెడు మోతాదులో తింటే అనేక లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఈ నట్స్‌ను తింటుంటే పలు వ్యాధులు నయం అవుతాయని అంటున్నారు.

జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..

టైగర్ నట్స్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉండేలా చేస్తుంది. దీంతో మలబద్దకం తగ్గుతుంది. ఈ నట్స్‌లో రెసిస్టెంట్ స్టార్చ్ ఉంటుంది. ఇది కూడా ఫైబర్ లాగే పనిచేస్తుంది. ఈ నట్స్‌ను తింటే ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తాయి. దీని వల్ల జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. దీంతో జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. టైగర్ నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే జీర్ణ వ్యవస్థలో ఎంజైమ్‌ల ఉత్పత్తి మెరుగు పడుతుంది. ముఖ్యంగా అమైలేజ్, లైపేజ్, కాటలేజ్ అనే ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. ఇవి మనం తిన్న ఆహారాన్ని సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తాయి. దీంతో గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్తి తగ్గుతాయి.

గుండె సంరక్షణకు..

టైగర్ నట్స్‌ను తింటే మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు లభిస్తాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. ఇవి శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. టైగర్ నట్స్‌లో అర్జినైన్ అనే అమైనో యాసిడ్ ఉంటుంది. ఇది రక్త నాళాలను వెడల్పుగా చేస్తుంది. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీని వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారు రోజూ ఈ నట్స్‌ను తింటుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. బీపీని అదుపులో ఉంచుకోవచ్చు. ఈ నట్స్‌లో విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి గుండెను, రక్త నాళాలను సంరక్షిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గిస్తాయి. దీంతో గుండె సురక్షితంగా ఉంటుంది.

డయాబెటిస్ ఉంటే..

టైగర్ నట్స్‌లో అధికంగా ఉండే ఫైబర్ కారణంగా తిన్న ఆహారంలో ఉండే పిండి పదార్థాలు రక్తంలో నెమ్మదిగా గ్లూకోజ్‌గా మారుతాయి. దీంతో షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. ఈ నట్స్‌లో ఉండే అర్జినైన్ అనే సమ్మేళనం ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచుతుంది. శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకునేలా చేస్తుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారు ఈ నట్స్‌ను రోజూ తింటుంటే ఫలితం ఉంటుంది. టైగర్ నట్స్‌లో విటమిన్ సి, ఇ అధికంగా ఉంటాయి. అలాగే యాంటీ ఆక్సిడెంట్లు సైతం ఎక్కువగానే ఉంటాయి, ఇవి ఇన్ ఫెక్షన్లను తగ్గిస్తాయి. ఈ నట్స్‌లో అధికంగా ఉండే జింక్, ఐరన్ రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తాయి. టైగర్ నట్స్‌లో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ నట్స్‌ను తింటే బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్లు తగ్గుతాయి. ఇలా టైగర్ నట్స్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

## ట్రంప్‌కు తలొగ్గిన మోదీ సర్కార్!.. రష్యా నుంచి చమురు దిగుమతులు కట్!

**అమెరికా నుంచి రెట్టింపు స్థాయిలో కొనుగోళ్లు**

**ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 114 % పెరుగుదల**

**అయినా లెక్కచేయనిట్రంప్.. టారిఫ్ వాత**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలకు లొంగిపోయిన కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆయనను ప్రసన్నం చేసుకోవడానికి శతవిధాలా చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. గత ఏప్రిల్‌లో ట్రంప్ చేసిన సుంకాల ప్రకటనతో బెదిరిపోయిన మోదీ ప్రభుత్వం అమెరికా నుంచి ముడి చమురు కొనుగోళ్లను రెట్టింపు చేసింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అమెరికా నుంచి ముడి చమురు కొనుగోళ్లు 114 శాతం పెరగడం విశేషం. 2024 ఏప్రిల్, జూన్ మధ్య త్రైమాసికంలో అమెరికా నుంచి దాదాపు రూ. 15,000 కోట్ల విలువైన చమురును భారత్ కొనుగోలు చేసింది. 2025 ఏప్రిల్, జూన్ మధ్య ఈ మొత్తం రూ. 32,000 కోట్లకు చేరుకుందని వర్గాలు వెల్లడించాయి.

**ట్రంప్ రాకతో పెరిగిన కొనుగోళ్లు**

2025 జనవరి, జూన్ మధ్య అమెరికా నుంచి రోజుకు 2,71,000 బ్యారెళ్ల ముడి చమురును భారత్ కొనుగోలు చేసింది. 2024లో అదే కాలంలో రోజుకు 1,80,000 బ్యారెళ్ల ముడి చమురు కొనుగోలు జరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 51 శాతం పెంపును సూచిస్తోంది. ఈ ఏడాదిలో ఒక్క జూలై నెలలోనే జూన్‌తో పోలిస్తే అమెరికా నుంచి ముడి చమురు దిగుమతులలో 23 శాతం పెరుగుదల ఉంది. భారత్ దిగుమతి చేసుకునే మొత్తం ముడి చమురులో అమెరికా వాటా 3 శాతం నుంచి 8 శాతానికి పెరగడం గమనార్హం.

**భారత్‌పై సుంకం విధింపు**

రష్యా నుంచి సైనిక పరికరాలు, చమురును కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు జూలై 30న ట్రంప్ ప్రకటించారు. ఉక్రెయిన్‌లో ప్రజలను చంపడం రష్యా ఆపాలని ప్రతి ఒక్కరూ కోరుతున్నప్పటికీ భారత్ మాత్రం రష్యా నుంచి చమురు దిగుమతులను కొనసాగిస్తూనే ఉందని, ఇది మంచిది కాదని ట్రంప్ అన్నారు. రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తున్నందుకు ఆగస్టు 1 నుంచి భారత్ 25 శాతం సుంకం, జరిమానా కట్టాలని ప్రకటించారు. ప్రస్తుతం భారత్ తన చమురు అవసరాలలో సుమారు 40 శాతాన్ని రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్నది. రష్యా నుంచి ప్రతిరోజు 11.50 లక్షల బ్యారెళ్ల ముడి చమురును భారత్ ప్రస్తుతం దిగుమతి చేసుకుంటున్నది.

**అమెరికా ఒత్తిడికి తలొగ్గి**

అమెరికా నుంచి వస్తున్న ఒత్తిళ్లు, పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకుని రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ దాదాపు నిలిపివేసిందని రాయిటర్స్ వార్తాసంస్థ కథనం పేర్కొంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం వంటి భారతీయ చమురు కంపెనీలు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేశాయని తెలిపింది. రాయితీలు తగ్గడం, సరకు రవాణాలో ఇబ్బందులు తలెత్తడమే ఇందుకు కారణమని వార్తాసంస్థ పేర్కొంది. రష్యా నుంచి ముడి చమురును 2022 నుంచి కొనుగోలు చేస్తున్నా మొట్టమొదటిసారి అతి తక్కువ రాయితీ ఇప్పుడే లభిస్తున్నదని, దీంతో రష్యా నుంచి కొనుగోళ్లను భారతీయ చమురు సంస్థలే నిలిపివేశాయని వార్తాసంస్థ పేర్కొంది. అయితే, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేస్తున్నట్లు వస్తున్న వార్తలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. రష్యా నుంచి ఇక ఎక్కువ కాలం చమురును భారత్ కొనుగోలు చేయదని వార్తలు



వస్తున్నాయని, అయితే ఈ వార్తలలోని నిజానిజాలు తనకు తెలియవని ఆయన వ్యాఖ్యానించారు. ఒకవేళ అదే జరిగితే మంచి విషయమేనని అన్నారు. తర్వాత ఏం జరుగుతుందో వేచి చూద్దామని కూడా ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ స్పందిస్తూ.. భారత చమురు అవసరాలకు సంబంధించి అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల ఆధారంగా, అప్పటి అంతర్జాతీయ పరిస్థితులను బట్టి నిర్ణయాలు ఉంటాయని చెప్పారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపివేశారా లేదా అన్నది సూటిగా సమాధానం చెప్పలేదు.

**భారత్‌పై మోయలేని భారం**

అమెరికా ఒత్తిడికి తలొగ్గి రష్యా నుంచి ముడి చమురు, రక్షణ పరికరాల దిగుమతులను భారత్ పూర్తిగా నిలిపివేసిన పక్షంలో భారత్ చమురు దిగుమతి ఖర్చులు ఏటా 1100 కోట్ల డాలర్లకు (దాదాపు 95 వేల కోట్లు) పెరుగుతాయని నిపుణులు హెచ్చరించారు. ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద చమురు దిగుమతిదారైన భారత్ భారీ రాయితీతో రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకుని గణనీయ స్థాయిలో ప్రయోజనం పొందింది.

# కాళేశ్వరం నుంచి బనకచర్ల దాకా..



రాజమండ్రి.. ఈ పేరు తెలుగువారిలో ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక భావనను కలిగిస్తుంది. ఇది తెలుగు సినిమాల ప్రభావం వల్ల కావచ్చు. కానీ, వాస్తవానికి కొబ్బరి చెట్లు, పచ్చటి పొలాలు, ప్రవహించే కాలువలు, నీళ్ల ప్రవాహాన్ని నియంత్రించే పాత లాకులతో ఈ ప్రాంతం ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు. మరీ ముఖ్యంగా ఇక్కడి ప్రజల మాటకారితనం, ఆత్మస్థైర్యం కట్టిపడేస్తాయి. సినిమాల్లో ఈ ప్రకృతి రమణీయత ఒక మాయజాలంలా కనిపిస్తుంది. రాజమండ్రి అనగానే మనకు వెంటనే గుర్తుకువచ్చేది.. నిండుగా పారే గోదావరి, ఆ నదిపై విస్తరించిన ఐదు కిలోమీటర్ల పొడవైన రైల్వే బ్రిడ్జి. ఒక్క మాటలో చెప్పాలంటే, మనుషులు, ప్రకృతి మధ్య ఉన్న ఆధ్యాత్మిక అనుబంధానికి ఈ ప్రాంతం ప్రతీక అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ధవళేశ్వరం బ్యారేజీ నిర్మాణానికి ముందు ఉభయ గోదావరి జిల్లాలు దుర్భిక్ష ప్రాంతాలుగా ఉండేవి. అభివృద్ధికి దూరంగా ఉండే ఈ ప్రాంతాలు తరచూ కరువు, వరద ప్రభావానికి గురయ్యేవి. 183233లో తీవ్రమైన కరువు, ఆ తర్వాత 183538 మధ్యకాలంలో వరుసగా మూడేండ్లు కరువు, 1839లో తుఫాను, ఆ తర్వాత సంవత్సరాల్లో కూడా విపత్తులు ఆ ప్రాంతాన్ని అతలాకుతలం చేశాయి. వరుస కరువులు, విపత్తుల కారణంగా ఆహారం లేక నిరాశ్రయులై ఆ ప్రాంతంలోని మూడో వంతు ప్రజలు మరణించారు. ఈ కాలాన్ని చరిత్రకారులు 'డొక్కల కరువు'గా (శరీరంలో మాంసం లేకుండా కేవలం ఎముకలు కనిపించే స్థితి) పేర్కొంటారు. ఆ కాలంలో బతుకడానికి పిల్లలను కొన్ని అణాలకే అమ్మేవారని ఒక సందర్భంలో సర్ ఆర్థర్ కాటన్ కుమార్తె ఎలిజబెత్ రీడ్ కాటన్ (లేడీ హోప్) చెప్పారు. ఈ దుస్థితికి విరుద్ధంగా నేడు గోదావరి డెల్టా అత్యంత సారవంతమైన, వ్యవసాయ ఉత్పాదకత కలిగిన ప్రాంతంగా మారింది. ఇది సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ధవళేశ్వరం ఆనకట్ట వల్లే సాధ్యమైంది. 1847లో ప్రారంభించి, 1852లో పూర్తయిన ఈ ఆనకట్ట ప్రజలను ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడటమే కాకుండా ఆధునిక సాగునీటి వ్యవస్థకు బాటలు వేసింది. ఆయనను ఇప్పటికీ అక్కడి ప్రజలు ఆరాధిస్తారు.

అయితే, విమర్శనాత్మక దృష్టితో చూస్తే కాటన్ ఈ ఆనకట్టను బ్రిటిష్ ప్రభుత్వ ప్రయోజనాల కోసం నిర్మించారని భావించవచ్చు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి భూమి శిస్తు ద్వారా ఆదాయాన్ని పెంచడమే ప్రధాన లక్ష్యమని.. కరువు నివారణ, ఈ ప్రాంత అభివృద్ధి ద్వితీయ లక్ష్యాలని విమర్శకులు అంటారు. రాజమండ్రి దగ్గర గోదావరి నది ఏడాది పొడవునా నిండుగా ప్రవహించడానికి ధవళేశ్వరం ఆనకట్ట కారణం. ఇది రాజమండ్రి నుంచి సుమారు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఆ ఆనకట్ట లేకుంటే ఒక్కసారి ఆ ప్రాంతాన్ని ఊహించుకోండి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమంటే.. తెలంగాణ అంతటా గోదావరిపైన ఇలాంటి బ్యారేజీలను నిర్మించి ఉంటే రాజమండ్రి వంటి అనేక సాంస్కృతిక కేంద్రాలతో తెలంగాణ విలసిల్లేది. అయితే, కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా బ్యారేజీలు నిర్మించినప్పటికీ, అవి రాజకీయ క్రీడలో పావులుగా మారడం తెలంగాణ చేసుకున్న దురదృష్టకరం. తెలంగాణకు దక్కాల్సిన గోదావరి జలాలు రాజకీయాల వల్ల తెలంగాణ రైతాంగానికి అందకపోవడం మన దౌర్భాగ్యం. ఇక్కడ ఇంకో ఉదాహరణ కూడా చెప్పుకోవాలి. అది ఉమ్మడి ఏపీలో నిర్మించిన నాగార్జున సాగర్ ప్రాజెక్ట్. దీన్ని నిర్మించకముందు కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు కరువుతో అల్లాడేవి. ఆ జిల్లాల ప్రజలు తక్కువ జీవన ప్రమాణాలతో బాధపడేవారు. గోదావరి జిల్లాలతో పోలిస్తే ఈ జిల్లాల రాజకీయ, సాంస్కృతిక ప్రాబల్యం కూడా చాలా తక్కువ. అయితే, ఈ ప్రాజెక్టును నిర్మించాక ఈ జిల్లాలు సామాజిక, ఆర్థికపరంగానే కాదు, రాజకీయపరంగానూ అసాధారణమైన వృద్ధి సాధించాయి.

ఈ ప్రాంతం అభివృద్ధి ప్రధానంగా కుల రాజకీయాలు, మీడియా, చలనచిత్ర పరిశ్రమలో కులాధిపత్యానికి దారితీసింది. కాళేశ్వరం, బనకచర్లపై నేడు చర్చ జరుగుతున్న నేపథ్యంలో ధవళేశ్వరం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల పోలిక, వాటి వల్ల జరిగిన మార్పులపై చర్చించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉన్నది. నీటిపారుదల ప్రాజెక్టులు ఆ ప్రాంత ఆర్థిక, సామాజిక స్థితిగతులను మెరుగుపరచడమే కాకుండా, రాజకీయ ప్రాబల్యాన్ని, సాంస్కృతిక ఆధిపత్యాన్ని పెంచడానికి కూడా దోహదపడతాయి. ధవళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఆర్థికంగా ఎదిగిన ఉభయ గోదావరి జిల్లాలు మద్రాస్-ఆంధ్ర రాజకీయాలను ప్రభావితం చేయగా, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా అభివృద్ధి చెందిన కృష్ణా-గుంటూరు జిల్లాలు ఉమ్మడి ఏపీ రాజకీయాలను శాసించాయి. ఉభయ గోదావరి జిల్లాలు గాని, కృష్ణా-గుంటూరు జిల్లాలు గాని ఆయా ప్రాంతాల్లో నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మించకముందు తెలంగాణలోని ఏ ఒక్క జిల్లా కంటే కూడా ముందంజలో లేవనే విషయాన్ని తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా రైతులు గుర్తించాలి. ఖర్చు లేకుండా సాగు నీరు లభ్యమవడంతో ఈ జిల్లాల్లో వ్యవసాయం లాభసాటిగా మారింది. వ్యవసాయంలో వచ్చిన 'మిగులు' ద్వారా వారి రాజకీయ ఆధిపత్యం పెరిగింది. నీటిపారుదల ప్రాజెక్టులు లేకుండా రాజకీయ నాయకత్వం బలపడదు. ఈ కోణంలో ఆలోచిస్తే కాళేశ్వరాన్ని విఫల ప్రాజెక్టుగా చూపెట్టడం ఒక రాజకీయ వ్యూహంగా కనిపిస్తున్నది. కాళేశ్వరంపై లేనిపోని ఆరోపణలు చేయడం, దుష్ప్రచారం చేయడం, తద్వారా దానిపై నిరర్థక ప్రాజెక్టుగా ముద్ర వేసి తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం వారి మొదటి లక్ష్యం. రెండవది, ఆర్థికంగా ఎదగకుండా చేసి తెలంగాణపై వెనుకబడిన ప్రాంతంగా ముద్రవేసి, ఇక్కడి ప్రజలను శాశ్వతంగా ఆత్మన్యూనతాభావంలో ఉంచడం.

ఇక బనకచర్ల విషయానికి వద్దాం. బనకచర్ల ప్రాజెక్టు నిర్మించనున్న ప్రాంతం, అంతర్-బేసిన్ జలాల మళ్లింపు, ఈ ప్రాజెక్టు ప్రతిపాదిత సమయంపై తెలంగాణవాదులు ఎక్కువగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'మిగులు జలాలు' అనే భావనను తెలంగాణ నీటిపారుదల ఇంజినీర్లు వ్యతిరేకిస్తున్నారు. చివరి ప్రాజెక్టును దాటిన తర్వాత నదిలో లభ్యమయ్యే నీటిని 'మిగులు'గా పరిగణించాలని ఇంజినీర్లు వాదిస్తున్నారు. ఈ లెక్కన గోదావరి విషయంలో ధవళేశ్వరం బ్యారేజీని దాటిన తర్వాతే పారే జలాలలను మిగులుగా పేర్కొనాలి. అందువల్ల మిగులు జలాలపై ఆధారపడి నిర్మించే ఏ ప్రాజెక్టు అయినా ధవళేశ్వరం దిగువన ఉండాలే తప్ప, ఎగువన కాదని వారు వాదిస్తున్నారు. అట్లాగే, ఎగువ ఉన్న నదీ పరీవాహక తీర రాష్ట్రాల అవసరాలు పూర్తిగా తీర్చకుండా అంతర్-బేసిన్ మళ్లింపు జరగకూడదని వారు గట్టిగా వాదిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలకుల పుణ్యమాని తెలంగాణలో దశాబ్దాల తరబడి గోదావరి ఎండిపోయింది. గోదావరి వల్ల తెలంగాణకు ఇసుమంతైనా ప్రయోజనం కలగలేదు. అందుకే, స్వరాష్ట్రంగా ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం తన సాగు, తాగునీటి అవసరాలను తీర్చుకునేందుకు కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. ప్రస్తుతం కాళేశ్వరం చుట్టూ జరుగుతున్న పరిణామాలు, రాజకీయ వివాదాలన్నీ పలు అనుమానాలను లేవనెత్తుతున్నాయి. గోదావరి నీటిని ఇలాగే వదిలేయడం ద్వారా ఏపీకి లబ్ధి చేకూర్చడం, ఇతర నదీ బేసిన్లకు జలాలను తరలించడం దీని వెనుక ఉన్న ఉద్దేశమని తెలుస్తున్నది. తమిళనాడులో ఓట్లు కొల్లగొట్టడానికి బనకచర్ల ద్వారా పెన్నా, తూతపూర్కు బేసిన్లకు గోదావరి నీటిని మళ్లిస్తున్నట్టయితే తెలంగాణకు జరిగే నష్టం అంతా ఇంతా కాదు. అది తరతరాలకు శాపంగా మారుతుంది. ఎందుకంటే పోతిరెడ్డిపాడు ఉదాహరణ మన కండ్లముందే ఉన్నది. కాళేశ్వరం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అణా పైసా ఇవ్వలేదు. అయినా తెలంగాణ ప్రభుత్వమే పూర్తిగా తన సొంత వనరులతో ఈ ప్రాజెక్టును నిర్మించుకున్నది. నయా పైసా ఇవ్వకపోగా కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు కాళేశ్వరం ద్వారా తెలంగాణకు అందుతున్న నీటిని ఇతర రాష్ట్రాల ప్రయోజనాల కోసం మళ్లించాలని చూస్తున్నది. తెలంగాణ జలాల విషయంలో 'అమ్మ పెట్టదు అడుక్కుతిననివ్వదుట' అన్నట్టుగా కేంద్రం వ్యవహరిస్తున్నది.

బనకచర్లకు సంబంధించి మరో అతిపెద్ద సమస్య ఏమంటే.. పక్షపాత ధోరణిని అవలంబిస్తున్న మీడియా, వాటిలో వస్తున్న కథనాలు. ఈ మీడియా ఎలాంటిదో అర్థం చేసుకునేందుకు కాళేశ్వరం విషయంలో జరిగిన విమర్శలు, దుష్ప్రచారమే చక్కని ఉదాహరణ. ఆర్థికంగా ఈ ప్రాజెక్టు సాధ్యపడుతుందా? ఆర్థిక భారం, స్థిరత్వం, పర్యావరణానికి జరిగే నష్టం, ప్రాజెక్టు వల్ల ముంపు, అటవీ సంరక్షణ, ముఖ్యంగా తెలంగాణకు నీళ్లు ఎందుకు అవసరమనే ప్రాథమిక ప్రశ్న సహా అనేక అంశాలపై దుష్ప్రచారం చేస్తూ ఈ మీడియా ప్రశ్నలు లేవనెత్తింది. తెలుగు, ఇంగ్లీష్ ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలో ఇలాంటి ప్రశ్నలతో కూడిన కథనాలే ఎక్కువగా కనిపించాయి. ప్రధానమైన ప్రశ్నలు ఏమంటే.. నీళ్లను లిఫ్ట్ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎందుకు అంతగా ఖర్చు చేస్తున్నది? అందుకు అవసరమైన విద్యుత్తు భారాన్ని ఎందుకు మోయాలి? తెలంగాణను తరతరాలుగా కరువు ప్రభావిత ప్రాంతంగా ఉంచాలనుకోవడమే వారి ఉద్దేశమని సుస్పష్టం. పెరిగిన నీటిపారుదల వసతి అధిక వరి సాగుకు దారితీస్తుందని, తద్వారా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలకు పెరుగుతాయని కొందరు నిపుణులు వాదించడం విడ్డూరం. అటవీ భూములు మునిగిపోవడాన్ని ప్రస్తావిస్తూ పర్యావరణ ఆందోళనలను లేవనెత్తారు. అయితే, ఎక్కడ కూడా ఉమ్మడి ఏపీలో తెలంగాణ దశాబ్దాలుగా ఎదుర్కొన్న నిర్లక్ష్యం గురించి గాని, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటా గురించి గాని ప్రస్తావించలేదు. తెలుగు, ఆంగ్ల మీడియాలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని సమర్థిస్తూ ఒక్క కథనం కూడా ప్రచురితం కాలేదు. దీంతో జాతీయ ఆంగ్ల మీడియాలోనూ ఇలాంటి కథనాలే వచ్చాయి. నేటికీ కాళేశ్వరం వల్ల తెలంగాణలో జరిగిన మార్పు గురించి దేశ ప్రజలకు తెలియదు. ఈ ప్రతికూల ప్రచారం జాతీయ నిపుణులు, కేంద్ర పాలనా యంత్రాంగం, ట్రిబ్యునళ్లు, ఇతర వర్గాల వరకు అంతకంతకూ వ్యాపించింది. ధవళేశ్వరం లేదా నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టుల ప్రభావం నీళ్లకు అతీతంగా ఉంటుంది. అది మేధో మూలధనాన్ని సృష్టిస్తుందని గుర్తించడం చాలా ముఖ్యం. తెలంగాణ విషయంలో కాళేశ్వరానికి మద్దతిచ్చే నిపుణులు, మేధావుల గొంతుకలు జాతీయ చర్చలో చాలా తక్కువగా వినిపించాయి. పక్షపాత మీడియా సంస్థలు వారి గొంతుకలను నొక్కివేశాయి. అందుకే దుష్ప్రచార కథనాలు ఈ చర్చలో ఎక్కువగా ఆధిపత్యం చెలాయించాయి. ఇప్పుడు బనకచర్ల విషయానికి వద్దాం. నేడు దేశంలో ఎక్కువగా వినిపిస్తున్న మాట బనకచర్ల. ఆ ప్రాజెక్టు ఆర్థికంగా సాధ్యపడుతుందా? దాని ఆర్థిక భారం మాటేమిటి? నదీ పరీవాహక ప్రాంతం వెలుపల నీళ్లను ఎందుకు మళ్లిస్తున్నారు? అంత అత్యవసరం ఏమొచ్చింది? అని తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా రైతాంగం నిలదీస్తున్నది. కాళేశ్వరం విషయంలో తీవ్ర చర్చనీయాంశమైన నీటిని ఎత్తిపోసే ఖర్చు గురించి ఇప్పుడు ఏ ఒక్క మేధావి కూడా గొంతు పెగలడం లేదు. పర్యావరణ సమస్య ఇప్పుడు అకస్మాత్తుగా తక్కువ ప్రాధాన్యాంశంగా మారిపోయింది. ప్రతిపాదిత పైప్‌లైన్లు నల్లమల అటవీ ప్రాంతం నుంచి వెళ్తాయి. దాని వల్ల సున్నితమైన పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటుంది. భారీ జలాశయాల నిర్మాణం వల్ల అక్కడి స్థానికులు నిరాశ్రయులవుతారు. కాళేశ్వరంపై విమర్శలు గుప్పించిన న్యాయ నిపుణులు, విద్యావేత్తలు, హక్కుల కార్యకర్తలు సహా పౌర సమాజం ఇప్పుడు బనకచర్ల విషయంలో మౌనం దాల్చడం ఆందోళనకరం. ఈ గొంతుకలన్నీ మూగబోవడంతో బనకచర్ల పట్ల తెలంగాణ అభ్యంతరాలను నొక్కిపెట్టడం ద్వారా ఒక వర్గం మీడియా పక్షపాత ధోరణిని అవలంబిస్తున్నది. బనకచర్ల విషయంలో ఇలాంటి ఆందోళనలను లేవనెత్తితే వాటిని అభివృద్ధి నిరోధకులుగా అభిప్రాయాలుగా, రాజకీయ ప్రేరేపితమైనవిగా ఈ మీడియా తోసిపుచ్చుతున్నది.

ఇప్పుడు కూడా తెలంగాణకు బనకచర్ల ఏ విధంగా నష్టం చేస్తుందో తెలియజేయకుండా దాని వల్ల ఆంధ్రకు కలిగే ఉపయోగాల గురించి ఎక్కువగా ప్రస్తావిస్తున్నది. అదీ తెలంగాణ ఎడిషన్లలో. ఇది బానిస మనస్తత్వాలపై ప్రయోగించే సాధనం. తన అవసరాలు, తను ఏం కోల్పోతున్నాడో బానిసకు తెలియకుండా దాచిపెట్టి.. యజమాని, ఆయన కుటుంబ అవసరాలను ప్రముఖంగా చూపెట్టే ప్రయత్నంలో బానిసను త్యాగాల దిశగా నడిపించే ప్రయత్నం జరుగుతుంది. పోతిరెడ్డిపాడు విషయంలో అదే జరిగింది. ఇప్పుడు బనకచర్ల విషయంలో అదే జరుగుతున్నది.

మహబూబ్ నగర్, నల్లగొండ, ఖమ్మం రైతులను విస్మరించి కరువు జిల్లాల పేరుతో కృష్ణా నీళ్లను ఏపీకి తరలించినట్టు.. ఇప్పుడు అదే ప్రాతిపదికన తెలంగాణ రైతుల ప్రయోజనాలను తక్కువ చేసి చూపుతూ బేసిన్‌లో లేని రైతుల ప్రయోజనాలే ముఖ్యమన్నట్టు వార్తలు ప్రచురిస్తున్నారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ గురించి ఈ మీడియా రాసిన వార్తలను మనం చూశాం. కాళేశ్వరానికి వ్యతిరేకంగా జాతీయ నిపుణులు మొదలుకొని అనామకులు చెప్పే విషయాల వరకు మొదటి పేజీల్లో ఏ విధంగా ప్రచురించారో గుర్తుచేసుకోవాలి. ఎక్కడా వినపడని, చదువని వాదనలను కాళేశ్వరంపై ప్రచురించారు. టీవీల్లో ప్రసారం చేశారు. జల నిపుణులుగా చెప్పుకొనే వ్యతిరేకుల అభిప్రాయాలకు ఇచ్చిన విలువ కాళేశ్వరం వల్ల ఒనగూడే ప్రయోజనాలకు ఈ మీడియా ఇవ్వలేదు. నరనరానా తెలంగాణ అంటే వ్యతిరేకత నింపుకొన్న ఒక మేధావి వర్గం కాళేశ్వరం వల్ల కళ్లకు కనిపిస్తున్న అభివృద్ధిని విస్మరించింది. వారికే ఈ మీడియా పెద్దపీట వేస్తున్నది. ముఖ్యంగా వారి అభిప్రాయాలను ప్రచురిస్తున్నాయి ఈ పత్రికలు. టీవీల్లో చూపిస్తున్నారు. కాళేశ్వరం విషయంలో అదే జరుగుతున్నది. కాళేశ్వరం, బనకచర్ల కథనాల్లో మనకు ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. తెలంగాణను కించపరచడం, తెలంగాణ ప్రయోజనాలను తక్కువ చేయడం, తెలంగాణను ఆర్థికంగా దెబ్బతీయడమే ఈ వర్గం మీడియా లక్ష్యం. తాము చదివే పత్రికలు, చూసే టీవీ చానళ్లు చాలా అరుదుగా తమ సమస్యలను ప్రస్తావిస్తాయని తెలంగాణ రైతు లు గుర్తించాలి. తాము చెప్పింది, చూపించిందే ముఖ్యమైన అంశమని భావించేలా ఈ పక్షపాత మీడియా తెలంగాణ ప్రజలపై తమ అభిప్రాయాలను రుద్దుతుంది. తెలంగాణ ప్రాజెక్టులను విస్మరించే మీడియా, వార్తాపత్రిక లు.. తెలంగాణ ప్రయోజనాలను సమర్థించే పత్రికల కంటే ఎక్కువగా ప్రాచు ర్యం పొందడం మన దురదృష్టకరం.

## ఎరుపు రంగు పాలకూరతో ఎన్నో లాభాలు..

## తరచూ తినాల్సిందే..!



మనకు అందుబాటులో ఉన్న అనేక రకాల ఆకుకూరల్లో పాలకూర కూడా ఒకటి. దీన్ని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయన్న విషయం అందరికీ తెలిసిందే. పాలకూరను తింటే అనేక పోషకాలు కూడా లభిస్తాయి. అయితే పాలకూర పేరు చెప్పగానే ఆకుపచ్చ రంగులో ఉండే ఆకులే ఊహకు వస్తాయి. కానీ మీకు తెలుసా ? ఇందులోనూ అనేక వెరైటీలు ఉన్నాయి. వాటిల్లో ఎర్ర పాలకూర కూడా ఒకటి. ఇది ముదురు ఊదా రంగులోనూ ఉంటుంది. మార్కెట్‌లో మనకు ఈ పాలకూర కూడా లభిస్తుంది. ఎరుపు రంగు పాలకూరలో ఆంథో సయనిన్స్ అధికంగా ఉంటాయి. అందుకనే ఆ కూరకు ఎరుపు రంగు వస్తుంది. ఆకుపచ్చ రంగు పాలకూరలాగే ఎరుపు రంగు పాలకూర కూడా మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. దీన్ని కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

### యాంటీ ఆక్సిడెంట్లు అధికం..

ఎరుపు రంగు పాలకూరలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇందులో బీటా సయనిన్స్, ఆంథో సయనిన్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఆకుపచ్చ పాలకూరలో ఉండవు. అందువల్ల ఎరుపు రంగు పాలకూరను తింటే యాంటీ ఆక్సిడెంట్లను అధిక మొత్తంలో పొందవచ్చు. ఇవి మన శరీరంలో ఉండే ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. వయస్సు మీద పడడం వల్ల వచ్చే వృద్ధాప్య చాయలు తగ్గుతాయి. ముఖంపై ఉండే ముడతలు తగ్గిపోతాయి. దీంతో ముఖం కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తారు. ఈ పాలకూరను తింటే ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. దీంతో అంతర్గతంగా ఏర్పడే వాపులు తగ్గుతాయి. దీని వల్ల గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.


### గుండె ఆరోగ్యానికి..

ఎరుపు రంగు పాలకూరలో నైట్రేట్స్ అధికంగా ఉంటాయి. ఇవి మన శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుతాయి. నైట్రిక్ ఆక్సైడ్ వల్ల రక్త నాళాలపై పడే ఒత్తిడి తగ్గి రక్త నాళాలు ప్రశాంతంగా మారుతాయి. రక్త నాళాలు వెడల్పు అవుతాయి. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీని వల్ల గుండెపై పడే భారం తగ్గుతుంది. ముఖ్యంగా బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారు ఈ పాలకూరను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హృదయ సంబంధిత వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. ఈ పాలకూరను తింటే శరీరంలోని కణాలకు ఆక్సిజన్, పోషకాలు సరిగ్గా లభిస్తాయి. దీంతో నీరసం, అలసట తగ్గుతాయి. ఈ పాలకూరను తినడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి.

### శరీర శక్తి సామర్థ్యాలకు..

రోజూ శారీరక శ్రమ లేదా వ్యాయామం చేసేవారు ఎరుపు రంగు పాలకూర జ్యూస్‌ను తాగుతుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. దీని వల్ల శరీరం కోల్పోయిన శక్తిని తిరిగి పొందుతుంది. దీంతో ఉత్సాహంగా మారుతారు. మళ్లీ యాక్టివ్‌గా పనిచేస్తారు. శరీర శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి. కండరాలకు మరమ్మత్తులు జరుగుతాయి. కండరాలు త్వరగా కోలుకుని శక్తిని పుంజుకుంటాయి. దీంతో మళ్లీ దృఢంగా మారుతారు. యాక్టివ్‌గా ఉంటారు. ఎరుపు రంగు పాలకూరలో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది మలబద్దకాన్ని తగ్గిస్తుంది. జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందేలా చేస్తుంది. దీంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఈ పాలకూర జ్యూస్‌ను రోజూ తాగడం వల్ల షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. ఇలా ఎరుపు రంగు పాలకూరతో అనేక లాభాలను పొందవచ్చు. కనుక దీన్ని తరచూ తినాలి.

## బ్రహ్మ ముహూర్తం.. భలే లాభం!



బ్రహ్మ ముహూర్తంలో నిద్ర లేవడం మంచిదని ఇంట్లో పెద్దలు చెబుతారు. ఈ సమయంలో చదివితే బాగా గుర్తుంటుందని బడిలో టీచర్లూ చెబుతుంటారు. సూర్యోదయానికి గంటన్నర ముందు నుంచి 48 నిమిషాల సమయాన్ని బ్రహ్మ ముహూర్తంగా పేర్కొంటారు పెద్దలు. ఈ సమయంలో నిద్ర లేచినంత మాత్రాన అద్భుతాలు జరిగిపోవు. కానీ, ఈ వేళను సమర్థంగా వాడుకుంటే.. బోలెడన్ని ప్రయోజనాలు ఉన్నాయని నిపుణుల మాట. బ్రహ్మ ముహూర్తంలో నిద్ర లేవడం వల్ల పరిసరాల్లో ఎటువంటి అలజడి ఉండదు. చుట్టూ ప్రశాంతంగా ఉంటుంది. రోజు తేలికగా మొదలైందన్న భావన కలుగుతుంది. మానసిక, భౌతిక పరిస్థితులు అనుకూలంగా ఉండటం వల్ల మనసు చదువుపై కేంద్రీకృతం అవుతుంది.ఆయుర్వేద శాస్త్రాల ప్రకారం బ్రహ్మ ముహూర్తంలో లేవడం వల్ల వాత, పిత్త, కఫ దోషాలు తొలగిపోతాయి. దీన్ని అలవాటుగా మార్చుకుంటే జీర్ణక్రియలు సాఫీగా సాగుతాయి. రక్తప్రసరణ మెరుగవుతుంది. రోగనిరోధక వ్యవస్థ అనేకరెట్లు బలపడుతుంది. బ్రహ్మ ముహూర్తంలోనే నిద్రలేచేవాళ్లు సూర్యోదయం తర్వాత ఆరుబయటికి వస్తారు. దీంతో ఉదయకాంతి శరీరంపై ప్రసరిస్తుంది. ఆహ్లాదకరమైన పరిసరాలను చూడటం వల్ల సెరటోనిన్ హార్మోన్ విడుదలవుతుంది. ఈ హార్మోన్ మానసికోల్లాసాన్ని పెంచుతుంది. చికాకు, బెంగ వంటి మానసిక భారాలను తగ్గిస్తుంది. ఆందోళన కూడా తగ్గుతుంది. త్వరగా నిద్ర లేవడం వల్ల తెల్లవారాక వాకింగ్, రన్నింగ్, జాగింగ్ చేయడానికి కావాల్సినంత సమయం ఉంటుంది. అలాగే రోడ్లు, పార్కులు, పరిసరాలు అనుకూలంగా ఉంటాయి. సూర్యోదయ సమయంలో వాహనాల రద్దీ ఉండదు. పరిశ్రమలు మూసి ఉంటాయి. గాలిలో ఆక్సిజన్ అధికంగా ఉంటుంది. ఊపిరితిత్తుల సామర్థ్యం పెంచుకోవడానికి, దీర్ఘ శ్వాస సాధన చేసేవారికి ఇది అనుకూల సమయం. త్వరగా నిద్రలేవడం వల్ల వ్యక్తిగత క్రమశిక్షణ అలవడుతుంది. కాబట్టి రోజువారీ పనులు ముందుగా మొదలుపెడతారు. అలాగే ముందుగానే పూర్తిచేస్తారు. కాబట్టి సక్సెస్ రేటు పెరుగుతుంది.

# తనదాకా వస్తే గానీ..



ఓ మహిళ ఒక రోజు గాంధీజీ వద్దకు వచ్చారట. గాంధీజీతో తన గోడు ఇట్లా వెళ్లబోసుకున్నారట. 'బాపూజీ.. నా కుమారుడు నిత్యం బెల్లం తింటున్నాడు. ఎంత చెప్పినా వినడం లేదు. మీరు చెప్తే వింటాడని మీ వద్దకు తీసుకొచ్చాను' అని ఆమె చెప్పారట. అయితే తనకు ఓ వారం రోజుల సమయం కావాలని ఆమెను గాంధీజీ అడిగారట. అంత వ్యవధి ఎందుకని గాంధీజీని తన అనుచరులు అడిగారట. వారం రోజుల తర్వాత ఆ బాలుడిని పిలిపించి బెల్లం తినొద్దని గాంధీజీ చెప్పి పంపించారట. తనకూ బెల్లం తినే అలవాటు ఉన్నది కాబట్టే, తాను మానిన తర్వాత గానీ ఇతరులకు నీతులు చెప్పొద్దనే ఉద్దేశంతోనే తాను మొదట ఆ బాలునికి దీని గురించి చెప్పలేదని గాంధీజీ తన అనుచరులకు చెప్పారట. అంటే తాను పాటించకుండా ఏ విషయం ఇతరులకు చెప్పొద్దని గాంధీజీనే చెప్పారు. ఇదంతా ఇప్పుడెందుకు అంటే మీడియా గొంతు నొక్కేస్తున్నారని గతంలో చెప్పిన మన ముఖ్యమంత్రి ఇప్పుడు అదే మీడియా విషయంలో, ప్రధానంగా జర్నలిస్టుల విషయంలో వ్యవహరిస్తున్న తీరు గురించి చెప్పేందుకే ఈ ఉపోద్ఘాతం. రాష్ట్ర ముఖ్యమంత్రి తాను విపక్షంలో ఉన్నప్పుడు మీడియా హక్కుల గురించి మాట్లాడారు. జర్నలిస్టులకు అండగా ఉంటానన్నారు. నాడు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని చెప్పిన ఆయన ఇప్పుడు తనను ప్రశ్నిస్తున్నవారిని అసలు జర్నలిస్టులే కాదంటున్నారు. అంతేకాదు, మీడియా మీట్‌లో ముందు వరుసలో కాలు మీద కాలేసుకొని కూర్చుని తమకు నమస్కారం పెట్టాలనే ధోరణిలో జర్నలిస్టులు ఉంటున్నారని ఎద్దేవా చేస్తూ, అలాంటివారి చెంప చెల్లుమనిపించాలన్నారు. అంతేకాదు, కొందరు సోషల్ మీడియా జర్నలిస్టులుగా చెలామణి అవుతున్నారని కూడా ఫైరయ్యారు. 'అ ఆ'లు కూడా రానివారు తాము జర్నలిస్టులమ ని చెప్పుకొంటున్నారని సెలవిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ పాలన గురించి సోషల్ మీడియాను అడ్డుపెట్టుకొని కొందరి చేత పనిగట్టుకుని దుష్ప్రచారం చేయించిన ఆయనకు నాటి మీడియా ఎంతో నచ్చింది. అప్పట్లో ఏ ఆధారాలు లేకుండానే బురదజల్లిన ప్రస్తుత అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రస్తుత ముఖ్యమంత్రి సహా నాడు వాటిని ప్రసారం చేసిన జర్నలిస్టు సమూహాల గురించి ఆహా ఓహో అంటూ కొనియాడారు. కానీ, ప్రస్తుతం అధికారంలోకి రాగానే అవే వేళ్లు తన వైపునకు చూపేసరికి అసెంబ్లీ సాక్షిగా బట్టలూడదీసి జర్నలిస్టులను కొట్టాలంటున్నారు. తమ సమస్యలను చెప్పుకోవడానికి ఒక వేదికగా నిలిచే ప్రెస్ క్లబ్‌ను కల్లు కాంపౌండ్, పబ్బులతో పోల్చడం ముఖ్యమంత్రికే చెల్లింది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భానికి ముందు కొందరు సోషల్ మీడియా జర్నలిస్టులు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై తమ ఇష్టానుసారంగా మాట్లాడారు. అప్పుడు సంతో షపడిన ఇదే సీఎం, ఇప్పుడు కస్సుబుస్సులా డుతున్నారు. తన దాకా వస్తే ఇలా ఉంటుం దా? కొందరు సోషల్ మీడియా జర్నలిస్టులు, మీలాంటి రాజకీయ నాయకుల ప్రయోజనాల కోసం పనిచేస్తే జర్నలిస్టు సమాజమంతా తప్పు చేసినట్టు మాట్లాడటం, చులకనభావంతో చూడ టం సరికాదు. జర్నలిస్టులు అనేవాళ్లను సమాజంలో చెడుగా చూపించే ప్రయత్నాన్ని మీరు పనిగట్టుకుని చేయడాన్ని జర్నలిస్టులు గాని, జర్నలిస్టు సంఘాలు గాని సహించవు. మన సీఎం మాత్రమే కాదు, ఆయన పాత మిత్రులు, ఆ మిత్రులకు తోడైన కొందరు కొత్త మిత్రులు.. అందరూ మీడియాపై విరుచుకుపడుతున్నవారే. ఎటొచ్చి జర్నలిస్టులే ఎటూ కాకుండాపోతున్నారు. రాహుల్‌గాంధీ నిత్యం ప్రజాస్వామ్యం గురించి, భావప్రకటనా స్వేచ్ఛ గురించి మాట్లాడుతున్నారు. చేతిలో రాజ్యాం గం పుస్తకాన్ని పట్టుకొని తిరిగే ఆయనకు ఆ రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 19(1)(ఏ) భావప్రకటనాస్వేచ్ఛ గురించి బాగా తెలుసు కాబట్టి, మీడియాకు స్వేచ్ఛ ఉండాలని కోరుకుంటున్నారు. తన గురించి ఎవ్వరు , ఏం మాట్లాడినా ఫర్వాలేదంటున్నారు. తనకు నచ్చిన విధంగా ముందుకెళ్తానని చెప్తున్నారు. కానీ, మన సీఎం మాత్రం, వాళ్ల అధినాయకుడి బాట కు భిన్నంగా వ్యవహరిస్తున్నట్టు స్పష్టంగా అర్థమవుతున్నది. ఏడాదిన్నరలోనే తమను ప్రశ్నించిన జర్నలిస్టులపై ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరించిందో మన కండ్లముందున్నది. ఒక చెం ప కొడితే మరో చెంప చూపించాలనే గాంధీజీ సిద్ధాంతాన్ని కాంగ్రెస్ పార్టీ ఏనాడో గాలికి వదిలేసింది. అయితే మన ముఖ్యమంత్రి గాంధేయ మార్గంలో నడుస్తున్నానని బయటకు చెప్తూనే అనేక చోట్ల ఆవేశంతో మాట్లాడే మాట లు యథావిధిగా మీడియా ప్రసారం చేస్తే మాత్రం సదరు ముఖ్యమంత్రికి చిర్రెత్తుకొస్తుంది. పలు సభల్లో ఆయన మాట్లాడుతూ పేగులు మెడలో వేసుకుంటానని, బట్టలూడదీసి కొడతానన్నారు. ఆ మాటలను యథావిధిగా ప్రసారం చేస్తే జర్నలిస్టులపై విరుచుకుపడ్డారు. ప్రభుత్వ పాలన జనరంజకంగా ఉంటే జర్నలిస్టులు అదే విషయాన్ని రాస్తారు. లేదు, ప్రజా కంఠకంగా పాలన సాగుతుంటే దానిని ప్రశ్నల రూపంలో సంధించి పాలకులకు తెలిసివచ్చేలా చేస్తుంటా రు. పాలకులనేవారు సద్విమర్శలను, సూచన రూపంలో వచ్చే వార్తలను అనుకూల దృక్పథంతో తీసుకోవాలి. అంతేకానీ, మీడియా సం స్థలు తమకు బాకా ఊదాలని, ఇంద్రుడు చం ద్రుడు అని పొగడాలని, తాము ఏం చేసినా ఏ నిర్ణయం తీసుకున్నా అదే సరైనదన్న రీతిలో వార్తలు కవర్ చేయాలని భావించడం పెద్ద తప్పు. తమ తప్పులను సరిచేసుకోకుండా మీడియాపైనా, జర్నలిస్టులపైనా విరుచుకుపడటం ఈ మధ్య ప్రతీ ఒక్కరికి ఫ్యాషన్‌గా మారింది. ఏ విభాగంలోనైనా ఒక్కరో, ఇద్దరో తప్పులు చేస్తుంటారు, అంతమాత్రాన మొత్తం ఆ విభాగానికే అంటగట్టడం, తక్కువ చేసి మాట్లాడటం ఏలికలకు తగదు. సమాజంలో గౌరవప్రదమైన వృత్తిగా భావించే జర్నలిజం, ఆ వృత్తిని ఆధారంగా చేసుకొని జీవిస్తున్న జర్నలిస్టులపై చులకనాభావం తగదు. రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛకు రాజకీయులు ప్రతిబంధకాలుగా మారడం మంచిది కాదు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
బుధవారం 06 - 08 - 2025

## పసిడి పరుగుకు బ్రేక్.... వెండి అదే దారిలో..!



పసిడి ధరలు కొనుగోలుదారులకు భారీ ఊరటనిచ్చాయి. భారీ అమ్మకాలు, ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ లేమి నేపథ్యంలో బంగారం ధరలు సోమవారం భారీగా తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో పుత్తడి ధర రూ.1550 తగ్గి.. తులం ధర రూ.91,450కి చేరుకుందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గత శుక్రవారం 99.9 ప్యూరిటీ గోల్డ్ తులానికి రూ.93వేలు పలికింది. ఇక 99.5 ప్యూరిటీ గోల్డ్ సైతం సోమవారం రూ.1550 తగ్గి రూ.91వేలకు చేరుకుంది. వరుసగా ఐదోరోజు వెండి ధర తగ్గింది. రూ.3వేలు తగ్గి.. కిలో రూ.92,500కి చేరుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సెగ్మెంట్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ మాట్లాడుతూ స్టాక్ మార్కెట్‌తో పాటు ఇతర రంగాల్లో భయాందోళనల మధ్య ధరలు తగ్గుముఖం పట్టాయన్నారు. ప్రస్తుతం బంగారం, వెండిపై ఒత్తిడి కొనసాగుతుందన్నారు. గత ఐదు సెషన్లలో కిలో వెండి ధర రూ.10,500 తగ్గిందన్నారు.ఇక ప్రపంచవ్యాప్తంగా స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు 10.16 డాలర్లు తగ్గి 3,027.20 డాలర్లకు చేరింది. ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ సెగ్మెంట్ వైస్ ప్రెసిడెంట్ అండ్ రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేది మాట్లాడుతూ.. పెరుగుతున్న వాణిజ్య ఉద్రిక్తతల మధ్య అమెరికా ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని పెట్టుబడిదారులు ఆసక్తిగా చూస్తున్నారన్నారు. రాబోయే యూఎస్ కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (%జూ×%) డేటా వడ్డీ రేటు తగ్గింపు అంచనాలను రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, ఇది ప్రపంచవ్యాప్తంగా గోల్డ్ దశ, దిశను ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. ఈ వారంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాలసీ మీటింగ్‌ని సైతం ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలిస్తారన్నారు. అయితే, సోమవారం ఆసియా మార్కెట్‌లో స్పాట్ వెండి ధరలు 1.65 శాతం పెరిగి ఔన్స్‌కు 30.04 డాలర్లకు చేరాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ ప్రకటన, చైనా ప్రతీకార సుంకాలు మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసిందని కోటక్ సెక్యూరిటీస్ పేర్కొంది.

## సామాన్యులకు షాక్ గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంపు



సామాన్యులకు చమురు కంపెనీలు షాక్ ఇచ్చాయి. ఓ వైపు ధరల పెరుగుదలతో ఇబ్బందిపడుతున్న జనం నెత్తిన మరోసారి భారం మోపాయి. గృహ వినియోగ సిలిండర్ ధరను పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. ఒకేసారి రూ.50 ధరను పెంచాయి. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ సోమవారం ఎల్‌పీజీ ధరలను రూ.50 పెంచుతున్నట్లు ప్రకటించారు. ఉజ్వల, సాధారణ కేటగిరీ వినియోగదారులకు గ్యాస్ ధరను పెంచినట్లు మంత్రి ప్రకటించారు. దాంతో 14.2 కేజీల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.803 నుంచి రూ.853కి పెరగనున్నది. ఇక ఉజ్వల యోజన పథకం లబ్ధిదారులకు 14.2 కేజీల సిలిండర్ ధర రూ.503 నుంచి రూ.553కి చేరనున్నది. పెరిగిన సిలిండర్ ధరలు మంగళవారం నుంచి అమలులోకి రానున్నాయి. ఇదిలా ఉండగా.. కేంద్రం లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ.2 ఎక్సైజ్ డ్యూటీని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ధరల్లో ఎలాంటి మార్పులు ఉండవని పేర్కొంది. ఎక్సైజ్ డ్యూటీ పెరుగుదలతో పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరల్లో.. పెరుగుదల ఉండదని చమురు మార్కెటింగ్ కంపెనీలు సమాచారం ఇచ్చినట్లు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వశాఖ సోషల్ మీడియా వేదికగా తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలను ప్రకటించిన నేపథ్యంలో ప్రపంచ మార్కెట్‌లో వాణిజ్య యుద్ధం భయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా పతనమ్యాయి. ఈ క్రమంలో కేంద్రం సెంట్రల్ ఎక్సైజ్ సుంకాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గిన నేపథ్యంలో అదనపు భారాన్ని కంపెనీలు సర్దుబాటు చేసుకుంటాయని భావిస్తున్నారు.

## కుప్పకూలిన భారత స్టాక్ మార్కెట్లు..
## 2020 తర్వాత తొలిసారి భారీగా పతనమైన నిఫ్టీ



ప్రపంచ మార్కెట్‌లో ప్రతికూల పవనాల నేపథ్యంలో మార్కెట్లు కుదేలయ్యాయి. ట్రంప్ ప్రతీకార సుంకాలపై చైనా సైతం పన్నులు ప్రకటించింది. ప్రపంచ వాణిజ్య యుద్ధం తప్పదనే సంకేతాల మధ్య భయాందోళనలు పెరిగాయి. దానికి తోడు అమెరికాలో మాంద్యం భయాలు ఎక్కువయ్యాయి. దాంతో పెట్టుబడిదారుల సెంటిమెంట్ దెబ్బతిన్నది. ఫలితంగా మార్కెట్‌లో భారీగా అమ్మకాలు జరిగాయి. సెన్సెక్స్ మూడుశాతానికిపైగా నష్టపోయింది. సెన్సెక్స్. నిఫ్టీ దాదాపు పదినెలల కనిష్ఠానికి చేరాయి. నిఫ్టీలో లిస్టయిన కంపెనీల విలువ రూ.20లక్షల కోట్ల వరకు పతనమైంది. క్రితం సెషన్ పోలిస్తే సెన్సెక్స్ 71,449.94 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. మార్కెట్ ప్రారంభంలోనే సెన్సెక్స్ దాదాపు 4వేల పాయింట్ల దాకా పతనమైంది. కేవలం పది సెకన్లలోనే మార్కెట్‌లో రూ.18లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరైంది. ఇంట్రాడేలో 73,403.99 పాయింట్ల గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. అత్యల్పంగా 71,425.01 పాయింట్ల కనిష్ఠానికి చేరుకుంది. చివరకు 2,226.79 పాయింట్ల నష్టంతో 73,137.90 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇదే బాటలో కొనసాగింది. ప్రారంభంలోనే వెయ్యి పాయింట్లకుపైగా పతనమైంది. చివరకు 742.85 పాయింట్ల నష్టంతో 22,161.60 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు పది నెలల తర్వాత కనిష్ఠానికి చేరుకున్నాయి. ముఖ్యంగా నిఫ్టీ 2020 మార్చి తర్వాత భారీగా పతనమైంది. మార్కెట్‌లో దాదాపు 559 షేర్లు పురోగమించగా, 3,372 షేర్లు కుప్పకూలాయి. నిఫ్టీ అత్యధికంగా ట్రెంట్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హిందాల్కో ఇండస్ట్రీస్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టీ నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్ లాభపడింది. ఇక మార్కెట్‌లో మెటల్ ఇండెక్స్ 6.7 శాతం, రియల్టీ ఇండెక్స్ 5.6 శాతం, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, ఆటో, ఎనర్జీ, ఐటీ 2.5 నుంచి 4 శాతం తగ్గడంతో అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 3.4 శాతం నుంచి 4 శాతం చొప్పున తగ్గాయి. మరో వైపు ఆసియా మార్కెట్లు సైతం భారీ నష్టాల్లో కొనసాగాయి. 2008 తర్వాత ఆసియా మార్కెట్లు భారీగా నష్టపోయాయి. మాంద్యం భయాలు మెటల్ కంపెనీల షేర్లు భారీగా నష్టాలను చవిచూశాయి.

## ఈ చెట్లకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్.. కాసులు కురిపించే వ్యాపారం



పోప్లర్ చెట్ల నుండి భారీ మొత్తంలో ఆదాయం పొందవచ్చు. పోప్లర్ చెట్ల కలప క్వింటాలుకు రూ.700-800 ధరకు అమ్ముడవుతోంది. ఈ చెట్టు దుంగ సులభంగా రూ.2000 వరకు అమ్ముడవుతోంది. ఒక హెక్టారులో 250 చెట్లను నాటవచ్చు. నేల నుండి.. భారతదేశం వ్యవసాయ దేశంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి జనాభాలో ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. ఇప్పుడు చదువుకున్న వారు కూడా వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. నేడు రైతులు వ్యవసాయం ద్వారా లక్షల కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. దేశంలో ఇలాంటి పంటలు చాలా ఉన్నాయి. దీనివల్ల రైతుల ఆదాయం లక్షలు, కోట్ల రూపాయల్లో ఉంటుంది. అదేవిధంగా ఈ రోజు మనం పోప్లర్ చెట్ల పెంపకం గురించి తెలుసుకుందాం. ఈ చెట్లకు మన దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ వేగంగా పెరుగుతోంది. పోప్లర్ చెట్ల నుండి చాలా డబ్బు సంపాదించవచ్చు. పోప్లర్ చెట్లను భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో కూడా పెంచుతారు. పోప్లర్ చెట్లను ఆసియా, ఉత్తర అమెరికా, యూరప్, ఆఫ్రికా దేశాలలో పెంచుతారు. ఈ చెట్టును కాగితం, తేలికపాటి ప్లైవుడ్, చాప్ స్టిక్స్, పెట్టెలు, అగ్గిపుల్లలు మొదలైన వాటిని తయారు చేయడానికి ఉపయోగిస్తారు.

### ఈ ఉష్ణోగ్రతలో చెట్లు పెరుగుతాయి:

పోప్లర్ సాగుకు 5 డిగ్రీల సెల్సియస్ నుండి 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత అవసరం. ఇది సూర్యకాంతిలో సరిగ్గా పెరుగుతుంది. మీరు ఈ చెట్ల మధ్య చెరకు, పసుపు, బంగాళాదుంపలు, కొత్తిమీర, టమోటాలు మొదలైన వాటిని కూడా పండించవచ్చు. వీటి నుండి కూడా మీరు మంచి డబ్బు సంపాదించవచ్చు. అయితే భారీ హిమపాతం ఉన్న ప్రదేశాలలో పోప్లర్ చెట్లను పెంచలేము. దాని సాగు కోసం పొలంలోని నేల 6 నుండి 8.5 %జూం% మధ్య ఉండాలి. మీరు పోప్లర్ చెట్లను నాటితే, ఒక చెట్టు నుండి మరొక చెట్టు మధ్య దూరం 12 నుండి 15 అడుగులు ఉండాలి.

### ప్రసిద్ధ చెట్టు నుండి సంపాదన:

పోప్లర్ చెట్ల నుండి భారీ మొత్తంలో ఆదాయం పొందవచ్చు. పోప్లర్ చెట్ల కలప క్వింటాలుకు రూ.700-800 ధరకు అమ్ముడవుతోంది. ఈ చెట్టు దుంగ సులభంగా రూ.2000 వరకు అమ్ముడవుతోంది. ఒక హెక్టారులో 250 చెట్లను నాటవచ్చు. నేల నుండి ఒక చెట్టు ఎత్తు దాదాపు 80 అడుగులు. ఆక్టెర్‌లో పోప్లర్ చెట్లను నాటడం ద్వారా 7-8 లక్షల రూపాయలు సులభంగా సంపాదించవచ్చు. ఈ రోజుల్లో ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నోర్ జిల్లా రైతులు పోప్లర్ చెట్టును ఎక్కువగా పండిస్తున్నారు. ఈ రైతులు చెరకు కంటే దీని ద్వారా ఎక్కువ ఆదాయం సంపాదిస్తున్నారు. ఈ చెట్ల ధర కూడా చాలా తక్కువ.

## బ్లాక్ మండే రక్త కన్నీరు..! కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు.. ట్రంప్ ఎఫెక్ట్‌తో కోలుకోలేని దెబ్బ



సోమవారం ప్రారంభం కాగానే.. దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లో కూరుకుపోయాయి.. సెన్సెక్స్ 3900 పాయింట్లకు పైగా పడిపోయింది.. నిఫ్టీ 1140 పాయింట్లకు పైగా నష్టంలో పతనమైంది. స్టాక్ మార్కెట్లపై ట్రంప్ సుంకాల ఎఫెక్ట్ కనిపించింది.. మొత్తంగా భారత స్టాక్ మార్కెట్లు 5 శాతం నష్టపోయాయి.. బ్యాంకింగ్, ఐటీ, ఫార్మా సహా మౌలికరంగాల షేర్లు అన్ని పతనమయ్యాయి. రచ్చ.. కల్లోలం.. బ్లాక్ మండే.. పేర్లు ఏవైనా పెట్టుకోండి.. డొనాల్డ్ ట్రంప్ సుంకాల బాంబ్‌కు- ప్రపంచమంతా బెంబేలెత్తిపోతోంది. రైతుల నుంచి స్టాక్‌మార్కెట్ల వరకు అంతా గోలగోల. ప్రపంచంపై ట్రంప్ వేసిన సుంకాల ఆటంబాంబ్ ఏ రేంజ్‌లో ఉందో నేడు కుప్పకూలిన స్టాక్ మార్కెట్‌లతో అర్థమవుతోంది.. ట్రంప్ ప్రతీకార సుంకాలతో ప్రపంచ స్టాక్‌మార్కెట్లతోపాటు.. భారత స్టాక్ మార్కెట్‌లలో కల్లోలం కనిపిస్తోంది. సోమవారం ప్రారంభం కాగానే.. దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లో కూరుకుపోయాయి.. సెన్సెక్స్ 3900 పాయింట్లకు పైగా పడిపోయింది.. నిఫ్టీ 1140 పాయింట్లకు పైగా నష్టంలో పతనమైంది. స్టాక్ మార్కెట్లపై ట్రంప్ సుంకాల ఎఫెక్ట్ కనిపించింది.. మొత్తంగా భారత స్టాక్ మార్కెట్లు 5 శాతం నష్టపోయాయి.. బ్యాంకింగ్, ఐటీ, ఫార్మా సహా మౌలికరంగాల షేర్లు అన్ని పతనమయ్యాయి. ట్రంప్ ప్రతీకార సుంకాలతో ప్రపంచ స్టాక్‌మార్కెట్లు విలవిల్లాడుతున్నాయి.. ఆసియా, ఆస్ట్రేలియా మార్కెట్లు తీవ్ర నష్టాల్లో కనిపిస్తున్నాయి. జపాన్ నిక్కీ 8 శాతం, కొరియా కోస్పి సూచీ 5 శాతం డౌన్ అయ్యాయి. ఆస్ట్రేలియా స్టాక్‌మార్కెట్ 6 శాతం పడిపోయింది. హాంకాంగ్ స్టాక్‌మార్కెట్లు 9 శాతం పతనం అయ్యాయి. అయితే- స్టాక్‌మార్కెట్ల ఈ మహా పతనాన్ని ట్రంప్ ఏమాత్రం లెక్కచేయడం లేదు. సుంకాలను మెడిసిన్ అంటూ ప్రెసిడెంట్ అభివర్ణించడం కలకలం రేపుతోంది.. స్టాక్‌మార్కెట్ల పతనంపై ఇన్వెస్టర్లు ఆందోళన వ్యక్తంచేస్తుండగా.. ట్రంప్ మాత్రం ఈ సుంకాలను- రోగానికి మందు అనే అర్థం వచ్చేలా అభివర్ణిస్తున్నారు. ఈ ప్రతీకార సుంకాల విషయంలో తమ ప్రభుత్వ నిర్ణయం సముచితమే అని ప్రజలు గ్రహిస్తారంటూ ఆయన తన సోషల్ మీడియా పోస్ట్‌లో వ్యాఖ్యానించారు. సుంకాలు చాలా మంచివని ట్రంప్ చెప్పుకున్నారు. ముఖ్యంగా చైనా, యూరోపియన్ యూనియన్‌తో తమకు వాణిజ్య లోటు భారీగా ఉందనీ, ఈ సమస్యకు ఇప్పటి సుంకాలు పరిష్కారం చూపుతాయని ట్రంప్ ఈ పోస్టులో వివరించారు. ట్రంప్ సుంకాల నిర్ణయాలతో అమెరికా స్టాక్‌మార్కెట్లు దారుణంగా నష్టపోయాయి. ఈ తెల్లవారుజామున మొదలైన ఆసియా, ఆస్ట్రేలియా మార్కెట్లు కూడా తీవ్రంగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి. జపాన్, చైనా, హాంకాంగ్, దక్షిణకొరియా ఇలా అన్నిచోట్లా ఇదే పరిస్థితి. మరి, మన స్టాక్‌మార్కెట్ల పరిస్థితి ఏంటి? భారీగా నష్టాలు మూటకట్టుకోవడానికి మన ఇన్వెస్టర్లు రెడీగా ఉండాలా? ట్రంప్ పేరుతో లాస్ ఎదుర్కోవడానికి మానసికంగా సిద్ధంగా ఉండాలా? ట్రంప్ ఇస్తున్న షాక్స్ ఎలా ఉన్నాయో మరో గంటసేపట్లో తేలిపోతుంది.

## ట్రంప్ సుంకాలతో ప్రపంచ స్టాక్‌మార్కెట్లలో కల్లోలం సుంకాలు మెడిసిన్ లాంటివన్న ట్రంప్!




రచ్చ.. కల్లోలం.. బ్లాక్ మండే.. పేర్లు ఏవైనా పెట్టుకోండి.. డొనాల్డ్ ట్రంప్ సుంకాల బాంబ్‌కు- ప్రపంచమంతా బెంబేలెత్తిపోతోంది. రైతుల నుంచి స్టాక్‌మార్కెట్ల వరకు అంతా గోలగోల. ప్రపంచంపై ట్రంప్ వేసిన సుంకాల ఆటంబాంబ్ ఏ రేంజ్‌లో ఉందో చూద్దాం.. సుంకాల వల్ల ఇప్పటికే నష్టాలు కనిపిస్తుంటే, ట్రంప్ మాత్రం లైట్ తీసుకుంటున్నారు. స్టాక్‌మార్కెట్ల పతనాన్ని ఆయన అస్సలు పట్టించుకోవడం లేదు. పైగా ఈ సుంకాలను- రోగానికి మందు అనే అర్థం వచ్చేలా అభివర్ణిస్తున్నారు. ప్రతీకార సుంకాల విషయంలో తమ ప్రభుత్వ నిర్ణయం సముచితమే అని ప్రజలు గ్రహిస్తారంటూ ఆయన తన సోషల్ మీడియా పోస్ట్‌లో వ్యాఖ్యానించారు. సుంకాలు చాలా మంచివని ట్రంప్ చెప్పుకున్నారు. ముఖ్యంగా చైనా, యూరోపియన్ యూనియన్‌తో తమకు వాణిజ్య లోటు భారీగా ఉందనీ, ఈ సమస్యకు ఇప్పటి సుంకాలు పరిష్కారం చూపుతాయని ట్రంప్ ఈ పోస్టులో వివరించారు. ట్రంప్ సుంకాల నిర్ణయాలతో అమెరికా స్టాక్‌మార్కెట్లు దారుణంగా నష్టపోయాయి. ఈ తెల్లవారుజామున మొదలైన ఆసియా, ఆస్ట్రేలియా మార్కెట్లు కూడా తీవ్రంగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి. జపాన్, చైనా, హాంకాంగ్, దక్షిణకొరియా ఇలా అన్నిచోట్లా ఇదే పరిస్థితి. మరి, మన స్టాక్‌మార్కెట్ల పరిస్థితి ఏంటి? భారీగా నష్టాలు మూటకట్టుకోవడానికి మన ఇన్వెస్టర్లు రెడీగా ఉండాలా? ట్రంప్ పేరుతో లాస్ ఎదుర్కోవడానికి మానసికంగా సిద్ధంగా ఉండాలా? ట్రంప్ ఇస్తున్న షాక్స్ ఎలా ఉన్నాయో మరో గంటసేపట్లో తేలిపోతుంది. ట్రంప్ ప్రతీకార సుంకాలతో ప్రపంచ స్టాక్‌మార్కెట్లలో కల్లోలం కనిపిస్తోంది. ఆసియా, ఆస్ట్రేలియా మార్కెట్లు తీవ్ర నష్టాల్లో కనిపిస్తున్నాయి. జపాన్ నిక్కీ 8 శాతం, కొరియా కోస్పి సూచీ 5 శాతం డౌన్ అయ్యాయి. అలాగే ఆస్ట్రేలియా స్టాక్‌మార్కెట్ 6 శాతం పడిపోయింది. హాంకాంగ్ స్టాక్‌మార్కెట్లు 9 శాతం పతనం అయ్యాయి. అయితే స్టాక్‌మార్కెట్ల ఈ మహా పతనాన్ని ట్రంప్ ఏమాత్రం లెక్కచేయడం లేదు. ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా రోడ్డెక్కారు..అమెరికన్లు. అధ్యక్షుడు తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలతో దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరిగిపోతోందంటూ లక్షల సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు. డోనాల్డ్ ట్రంప్‌తో పాటు, మస్క్ తీసుకుంటున్న నిర్ణయాలు అమెరికాను మరింత ముంచేస్తున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు యూఎస్ జనం. ట్రంప్ నిర్ణయం మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేస్తోంది. చైనా మార్కెట్ 10 శాతం తగ్గగా, హాంకాంగ్ మార్కెట్ 10 శాతానికి పైగా పడిపోయింది. అమెరికన్ స్టాక్ మార్కెట్ వాల్ స్ట్రీట్ పై నిఘా ఉంచే నిపుణుల అభిప్రాయం ప్రకారం, మార్కెట్ మరింత 15-20% క్షీణతను చూడవచ్చు. నిపుణుల ఈ అంచనా తర్వాత, ప్రజలలో ఉద్రిక్తత పెరిగింది. అమెరికా భారత ఉత్పత్తులపై 26%, ఇతర దేశాలపై 10% దిగుమతి సుంకాన్ని విధించింది. చైనా 34% సుంకం విధించడం ద్వారా ప్రతీకారం తీర్చుకోగా, కెనడా అమెరికన్ వాహనాలపై 25% సుంకం విధించింది. దీని కారణంగా ప్రజలలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దిగుమతి చేసుకున్న వస్తువులపై కొత్తగా 10% సుంకం విధించడం, డజన్ల కొద్దీ దేశాలపై ప్రతీకార సుంకాలు విధించడం పట్ల వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఈ కారణంగానే మార్కెట్ నుండి భారీ మొత్తంలో డబ్బు ఉపసంహరించబడుతోంది. దీని కారణంగా భారీ క్షీణత కనిపిస్తోంది. ట్రంప్ సుంకాల నిర్ణయం ప్రపంచ మార్కెట్లలో ద్రవ్యోల్బణం భయాలను పెంచింది. దీని కారణంగా మాంద్యం ముప్పు తీవ్రమవుతున్నట్లు కనిపిస్తోంది. సుంకాలు దిగుమతి చేసుకున్న వస్తువుల ధరలు పెరగడానికి కారణమవుతాయని నిపుణులు భావిస్తున్నారు.

